నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | బుధవారం 25-8-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 20 | పేజీలు:4 | వెల: రూ.1/-

ఆగస్టు 31 డెడ్‌లైన్.. అమెరికాకు తాలిబన్ల వార్నింగ్

అఫ్గానిస్థాన్ , ఆగష్టు 24: అఫ్గానిస్థాన్ ను ఆక్రమించుకున్న తాలిబన్?లు అగ్రరాజ్యం అమెరికాకు డెడ్ లైన్ విధించారు. అఫ్గన్ లో ఉన్న తమ దేశ ప్రజలను తరలించే ప్రక్రియను అమెరికా దృష్టి పెట్టింది. అఫ్గన్ నుంచి అమెరికా సైన్యాల ఉపసంహరణకు గడువు ఆగస్టు 31 దగ్గర పడుతోంది. పొడిగింపు అంశంపై సైన్యంతో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తెలిపారు.

అయితే, ఈ ప్రకటనపై తాలిబన్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. అఫ్గన్ గడ్డపై నుంచి అమెరికన్ సేనల ఉపసంహరణకు ఆగస్టు 31 డెడ్ లైన్ అని తేల్చిచెప్పారు. ఆ సమయం దాటిన తర్వాత అమెరికా, నాటో దళాలు తమ గడ్డపై ఉంటే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. తాలిబన్ల వశమైన అఫ్గనిస్థాన్‌లో ప్రస్తుతం కాబూల్ విమానాశ్రయం మాత్రమే విదేశీ సైన్యాల ఆధీనంలో ఉంది. అమెరికా సహా పలు దేశాల రాయబార కార్యాలయాలు అక్కడ నుంచే పనిచేస్తున్నాయి. కాగా, అఫ్గన్‌ను తాలిబన్లు ఆక్రమించుకోవడంతో అక్కడ చిక్కుకున్న విదేశీయుల తరలింపు క్లిష్టంగా మారింది.

కేంద్ర మంత్రి నారాయణ్ రాణె అరెస్ట్

ముంబై, ఆగష్టు 24:: మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాక్రేను చెంప దెబ్బ కొట్టేవాడినని చేసిన వ్యాఖ్యలపై పోలీసులు కేంద్ర మంత్రి నారాయణ్ రాణె(బిజెపీజీఎజీని ఖీజీనివ)ను అరెస్ట్ చేశారు. ఇప్పటికే కేంద్రమంత్రి ఉన్న సంగమేశ్వర్‌కు వెళ్లిన పోలీసుల బృందం.. అరెస్ట్ ప్రక్రియను కొనసాగిస్తోంది. అరెస్ట్ నుంచి తప్పించుకోవడానికి ముందస్తు బెయిల్ కోసం రత్నగిరి కోర్టు, బాంబే హైకోర్టులకు వెళ్లిన నారాయణ్ రాణెకు రెండు చోట్లా చుక్కెదురైంది.

తన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై అత్యవసరంగా విచారించాలన్న పిటిషన్‌ను బాంబే హైకోర్టు తిరస్కరించింది. దేశానికి ఏ ఏడాది స్వాతంత్ర్యం వచ్చిందో తెలియని ఉద్ధవ్ థాక్రేను తాను చెంప దెబ్బ కొట్టేవాడినని సోమవారం ఓ ర్యాలీలో అన్నారు కేంద్ర మంత్రి నారాయణ్ రాణె. దీనిపై శివసేన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పలు పోలీస్ స్టేషన్‌లలో ఆయనపై ఫి ర్యాదులు చేసింది. బీజేపీ కార్యాలయాలపై శివసేన కార్యకర్తలు దాడులు కూడా చేశారు.

సెప్టెంబర్ 1 నుంచి విద్యాసంస్థలు ప్రారంభం : మంత్రి సబితా ఇంద్రారెడ్డి

హైదరాబాద్ , ఆగష్టు 24:సెప్టెంబర్ 1వ తేదీ నుంచి విద్యాసంస్థలు ప్రారంభం కానున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. పాఠశాలల పునఃప్రారంభంపై మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు మంగళవారం జిల్లాల కలెక్టర్లు, విద్య, వైద్యం, పంచాయతీరాజ్, పురపాలకశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. అందరి భాగస్వామ్యంతో పాఠశాలలను పూర్తిస్థాయిలో సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. 65 లక్షలమంది విద్యార్థులు పాఠశాలలకు హాజరు కానున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో తల్లిదండ్రులకు విశ్వాసం కల్పించాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు.

అధికారులు, ప్రజాప్రతినిధులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. ఈ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులంతా భాగస్వామ్యం కావాలని, సర్పంచులు బాధ్యత తీసుకోవాలని కోరారు. పరిశుభ్రతను నిరంతరం కొనసాగించాలన్నారు. ఈ అంశంలో ప్రధానోపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలన్నారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్ మాట్లాడుతూ.. పాఠశాలలు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. పాఠశాలలు శుభ్రంగా ఉన్నట్లు హెచ్ఎంలు ధ్రువపత్రం ఇవ్వాలన్నారు. ఏఎన్ఎంలు, వైద్య సిబ్బందిని కూడా సిద్ధం చేసినట్లు మంత్రి పేర్కొన్నారు.

దళితబంధు పథకానికి మరో రూ. 200 కోట్లు విడుదల

హైదరాబాద్ , ఆగష్టు 24: దళితబంధు పథకానికి తెలంగాణ ప్రభుత్వం మరో రూ. 200 కోట్లు కేటాయిస్తూ ఇవాళ ఉత్తర్వులు జారీ చేసింది. దళితుల సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం దళితబంధు పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నది. హుజూరాబాద్ నియోజకవర్గంలో ఈ నెల 16న ఈ పథకానికి సంబంధించిన పైలెట్ ప్రాజెక్టును ప్రారంభించింది.

నియోజకవర్గంలోని ప్రతి దళిత కుటుంబానికి ఈ పథకం కింద రూ.10 లక్షల చొప్పున అందించనున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఇప్పటికే దళిత బంధు పథకానికి ప్రభుత్వం తొలి విడత రూ. 500 కోట్లు విడుదల చేసింది. సోమవారం రెండో విడతలో మరో రూ. 500 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా ఇవాళ మరో 200 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ఈ పథకానికి ఇప్పటివరకు రూ. 1200 కోట్లు కేటాయించినట్లయ్యింది. పథకం అమలుకు రూ. 2 వేల కోట్లు కేటాయించనున్నట్లు సీఎం కేసీఆర్ శాలపల్లిలో దళితబంధు పథకం ప్రారంభోత్సవ సభా వేదికగా ప్రకటించారు. మరో నాలుగైదు రోజుల్లో మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వం విడుదల చేయనున్నట్లు తెలుస్తున్నది. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. దళిత ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలకు సైతం దళితబంధు వర్తింపజేస్తామని సీఎం ప్రకటించిన విషయం తెలిసిందే.

సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశానికే ఆదర్శం

హైదరాబాద్ , ఆగష్టు 24: సీఎం కేసీఆర్ సారథ్యంలోని తెలంగాణ సర్కార్ సంక్షేమ పథకాల అమల్లో దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. సనత్‌నగర్, అమీర్‌పేట్, బేగంపేట్ డివిజన్లకు చెందినే 16 మంది లబ్దిదారులకు 11 కళ్యాణలక్ష్మి, 5 షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కార్పొరేటర్ కొలను లక్ష్మీరెడ్డి , మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారిలతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ అట్టడుగు వర్గాల జీవన ప్రమాణాలు పెరిగేలా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు.

ఒకరిపై ఆధారపడి జీవించాల్సిన పరిస్థితులు లేకుండా వితంతువులు, అనాథలు, వృద్ధులు, వికలాంగులకు పెన్షన్లు అందుతున్నాయని, నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణాలు దేశంలోనే ఇప్పటివరకు ఎవరూ అమలు చేయని పథకమని, ఈ పథకం ద్వారా లబ్దిపొందుతున్న నిరుపేదలు ఆత్మగౌరవ జీవితాలను గడుపుతున్నారని తెలిపారు. అర్హులైన ప్రతిఒకరు ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు కొలను బాల్‌రెడ్డితో పాటు ఖైరతాబాద్ , అమీర్‌పేట్ డిప్యూటీ తాసీల్దార్లు అశోక్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

మరో 20 ఏళ్లు టీఆర్ఎస్‌దే అధికారం : సీఎం కేసీఆర్

హైదరాబాద్ , ఆగష్టు 24:రానున్న 20 ఏళ్లు తెలంగాణలో టీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వమే ఉంటుందని ఆ పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు అన్నారు. టీఆర్ఎస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన మంగళవారం నగరంలోని తెలంగాణ భవన్‌లో జరిగిన టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో పార్టీ సంస్థాగత నిర్మాణంపై సీఎం చర్చించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి శాఖల పునర్నిర్మాణం వరకు సమావేశంలో చర్చించారు. అదేవిధంగా దళితబంధు అమలు విషయంలో పార్టీ శ్రేణులు అనుసరించాల్సిన వ్యూహం, తీసుకోవాల్సిన చర్యలు, పార్టీ చేయాల్సిన కృషిపై సీఎం కేసీఆర్ నేతలకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. నవంబర్ మొదటివారంలో పార్టీ ప్లీనరీ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. దళిత బంధుపై ప్రజలను చైతన్యం చేయాలన్నారు. ప్రతిపక్షాల తప్పుడు విమర్శల్ని తిప్పికొట్టాల్సిందిగా పిలుపునిచ్చారు. దళితబంధును ఉద్యమంలా చేయాలన్నారు. వచ్చే నెల 2వ తేదీన ఢిల్లీలో తెలంగాణ భవన్‌కు శంకుస్థాపన చేసుకోబోతున్నట్లు తెలిపారు. దశలవారీగా సమాజంలోని అన్ని వర్గాలకు న్యాయం చేస్తామన్నారు. త్వరలోనే కొత్త జిల్లా అధ్యక్షులను నియమిస్తామని సీఎం పేర్కొన్నారు.

ఎదురెదురుగా రెండు విమానాలు.. తృటిలో తప్పిన ప్రమాదం

ముంబై, ఆగష్టు 24:: ఆకాశ మార్గంలో రెండు విమానాలు ఎదురెదురుగా ప్రయాణించాయి. చాలా దగ్గరకు వచ్చిన తర్వాత అలెర్ట్ కావడంతో అవి ఢీకొనే ప్రమాదం తప్పింది. జనవరి 29న జరిగిన ఈ ఘటనకు సంబంధించిన నివేదికను ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ంంఖ:) ఇటీవల విడుదల చేసింది. జనవరి 29న ఎయిర్ ఏషియాకు చెందిన అహ్మదాబాద్-చెన్నై విమానం, ఇండిగోకు చెందిన బెంగళూరు-వడోదర విమానం ముంబై గగనతలంలో ఎదురెదురుగా చాలా దగ్గరకు వచ్చాయి. ఇవి 8 కిలోమీటర్ల దూరంలో ఉండగా ఇండిగో విమానం 38,000 అడుగుల ఎత్తులో, ఎయిర్ ఏషియా విమానం 38,008 అడుగుల ఎత్తులో ఎదురెదురుగా ఉన్నాయి. ఆ రెండు విమానాల మధ్య దూరం 6.5 కిలోమీటర్లు ఉండగా ఎయిర్ ఏషియా విమానంలోని వ్యవస్థ పైలట్లను హెచ్చరించింది. విమానాన్ని మరింత ఎత్తులోకి తీసుకెళ్లాలని అప్రమత్తం చేసింది. దీంతో ఆ విమానం 38,396 అడుగుల ఎత్తుకు చేరడంతో ఆ రెండు ఢీకొనే ప్రమాదం తప్పింది.

అయితే రెండు విమానాల పొజిషన్‌ను అంచనా వేయడంలో ముంబై ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ విఫలమయ్యారని ఆ నివేదిక పేర్కొంది. ఆటోమేటిక్ సిన్టమ్ హెచ్చరించినప్పటికీ రెండు విమానాలను హెచ్చరించడంలో కంట్రోలర్ నిర్లక్ష్యం వహించారని ఆరోపించింది. కాగా, సాధారణంగా అహ్మదాబాద్ నుంచి దక్షిణాది రాష్ట్రాలకు వెళ్లే విమానాలు భావనగర్ మీదుగా ప్రయాణిస్తాయి. అయితే ఆ రోజున ఎయిర్ ఏసియా విమానం ముంబై విమానాశ్రయంలో ల్యాండిగ్ మార్గంలో ప్రయాణించింది. ఎయిర్ ఏసియా విమానం తన మార్గాన్ని మార్చుకోవడంతో అదే మార్గంలో వస్తున్న ఇండిగో విమానం సమీపానికి వచ్చింది.

చివరకు ఎయిర్ ఏసియా విమానంలోని వ్యవస్థ హెచ్చరించడంతో ఎత్తు పెంచడంతో ఆ రెండు విమానాలు 300 మీటర్ల ఎత్తు, 500 మీటర్ల సమీపంలో క్రాస్ అయ్యాయి. ఎయిర్ ఏసియా విమానం సాధారణ రూట్‌లోనే ప్రయాణిస్తున్నదని కంట్రోలర్ భావించడం వల్ల లేదా మద్యం మత్తులో ఉండటం వల్ల ఇది జరిగి ఉంటుందని ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో తన నివేదికలో పేర్కొంది.

ఏపీపీల నియామకాల్లో వయోపరిమితి సడలింపు.. హర్షం వ్యక్తం చేసిన న్యాయవాదులు

హైదరాబాద్ , ఆగష్టు 24: తెలంగాణ ప్రభుత్వం త్వరలో భర్తీ చేయనునున్న అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల (ఏపీపీ) పోస్టులకు ఇప్పుడున్న గరిష్ఠ వయోపరిమితిని 34 ఏండ్ల నుంచి 44 సంవత్సరాలకు పెంచినందుకు టీఆర్ఎస్ లీగల్ సెల్ హర్షం వ్యక్తం చేసింది. దీంతో నిరుద్యోగులకు ఎంతో లబ్ధి చేకూరునుందని చెప్పారు. ఏపీపీ అభ్యర్థుల విజ్ఞప్తుల మేరకు స్పందించి వయోపరిమితిని సడలించినందుకు సీయం కేసీఆర్ కు ధన్యవాదాలు తెలిపారు.

ఈ నేపథ్యంలో టీఆర్ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు అరణ్య భవన్ లో న్యాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో టీఆర్ఎస్ లీగల్ సెల్ ఇంచార్జీ సీ. కల్యాణ్ రావు, ఇతర టీఆర్ఎస్ లీగల్ సెల్ ప్రతినిధులు లలితారెడ్డి, నల్లమోతు రాము, వేణుగోపాల రావు, అజయ్ కుమార్, పురంధర్ రెడ్డి, రాము పసుపుల, శ్రీనివాస్ నాయక్, చంద్రశేఖర్ ,జయకృష్ణ, తదితరులు ఉన్నారు.

మొబైల్ వ్యాక్సినేషన్‌ను ప్రారంభించిన డిప్యూటీ మేయర్

హైదరాబాద్ , ఆగష్టు 24: తార్నాక డివిజన్ చింతల్ బస్తీ (విజయ డెయిరీ సమీపంలో)లో మొబైల్ వ్యాక్సినేషన్ కేంద్రాన్ని నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరోనా కట్టడికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల్లో భాగంగా మొబైల్ వ్యాక్సినేషన్ కార్యక్రమం ఒకటని అన్నారు. స్థానిక ఆశా వర్కర్ల ద్వారా ఈ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నామన్నారు.

దేశంలోని మిగతా రాష్ట్రాల కంటే మన రాష్ట్రంలో వ్యాక్సినేషన్ వెరుగ్గా జరుగుతోందని చెప్పారు. ప్రతి ఒక్కరూ వ్యాక్సిన్ వేసుకున్నప్పుడే కరోనా మహమ్మారిని తరిమివేయవచ్చని అభిప్రాయపడ్డారు. ఎలాంటి అపోహలకు తావివ్వకుండా వ్యాక్సిన్ తీసుకుని మహమ్మారిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీటీయూసీ వ్యవస్థాపక అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి, స్థానిక టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వానాకాలం 55 లక్షల ఎకరాల్లో వరిసాగు : మంత్రి నిరంజన్ రెడ్డి

హైదరాబాద్ , ఆగష్టు 24:ఈ వానాకాలం సీజన్‌లో రాష్ట్రంలో దాదాపు 55 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేయనున్నట్లు అంచనాలు ఉన్నాయని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. ఈ సీజన్‌లో 1.48 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కావొచ్చని అంచనా వేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో వానాకాలం సాగు పురోగతిపై మార్కెటింగ్, పౌరసరఫరాలు, వ్యవసాయశాఖ అధికారులతో మంత్రి నిరంజన్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ధాన్యం ఉత్పత్తి అంచనా, కొనుగోళ్లు తదితర అంశాలపై అధికారులతో ఆయన చర్చించారు. ఎఫ్‌సీఐ 60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు అంగీకరించినట్లు ఆయన వెల్లడించారు. మరో 20 లక్షల టన్నులు అదనంగా సేకరించాలని ఎఫ్‌సీఐకి తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తి చేసిందన్నారు.

ఉత్తరాఖండ్ అసెంబ్లీ వద్ద కాంగ్రెస్ ఎమ్మెల్యేల ధర్నా

డెహ్రాడూన్, ఆగష్టు 24:: ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు హరీష్ ధామి, మనోజ్ రావత్ ఆ రాష్ట్ర అసెంబ్లీ వద్ద మంగళవారం ధర్నా చేశారు. ధార్చులలో మొబైల్ కనెక్టివిటీని మెరుగుపర్చాలని, చార్ ధామ్ యాత్రను తిరిగి ప్రారంభించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకుని అక్కడకు వచ్చిన సీఎం పుష్కర్ సింగ్ ధామి వారి విన్నపాలను స్వీకరించారు.

మరోవైపు చార్ ధామ్ దేవస్థానం బోర్డును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గత కొన్ని నెలలుగా అర్చకులు నిరసనలు, ధర్నాలు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో సీఎం పుష్కర్ సింగ్ ధామి దీనిపై స్పందించారు. అర్చకుల హక్కులను దేవస్థానం బోర్డు హరించకుండా చూస్తామన్నారు.

అందరి అభిప్రాయాలను ప్రభుత్వం వింటుందని, సమస్యలను పరిష్కరిస్తుందని సీఎం భరోసా ఇచ్చారు. కమ్యూనికేషన్ గ్యాప్ ఉండకూడదని, చర్యల ద్వారా పరిష్కారాన్ని కనుగొనాలని అన్నారు. అన్ని సందేహాలు తీరుస్తామని, అవసరమైతే ఉత్తరాఖండ్ చార్ ధామ్ దేవస్థానం బోర్డు చట్టానికి సవరణలు చేస్తామని తనని కలిసిన అర్చక ప్రతినిధులకు భరోసా ఇచ్చారు.

రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా ప్రొఫెసర్ లింబాద్రి

హైదరాబాద్ , ఆగష్టు 24:తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా ప్రొఫెసర్ లింబాద్రి నియమితులయ్యారు. ఈ మేరకు ఇవాళ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రభుత్వం తదనంతర ఉత్తర్వులు ఇచ్చే వరకు లింబాద్రి ఈ స్థానంలో కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షుడిగా ప్రొఫెసర్ లింబాద్రి కొనసాగుతున్నారు.

ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా ఉన్న పాపిరెడ్డి పదవీకాలం ఇవాళ్టితో ముగియడంతో లింబాద్రికి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా లింబాద్రి మంత్రి కేటీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

రేపు టీఎస్ ఎంసెట్ ఇంజినీరింగ్ ఫలితాలు

హైదరాబాద్ , ఆగష్టు 24: రేపు టీఎస్ ఎంసెట్ ఇంజినీరింగ్ ఫలితాలు విడుదల కానున్నాయి. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి రేపు ఉదయం 11 గంటలకు ఫలితాలు విడుదల చేయనున్నారు. ఫలితాల విడుదలకు ఇప్పటికే అధికారులు అన్ని ఏర్పాటు చేశారు. ఆగస్టు 4న ఎంసెట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొత్తం 2 లక్షల 51వేల 606మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇంజినీరింగ్ విభాగానికి 1,64,962 మంది, మెడికల్ విభాగానికి 86,644 మంది దరఖాస్తు చేసుకున్నారు.

చరిత్రలో నేటినిజం

కం॥ 'సురవరము'న సరవరుడై
చరితను శోభించి నట్టి ఉత్తమ్ఝుండై
వర తెలంగాణమున వెలిగె
"సురవరము ప్రతాపరెడ్డి" శుభచరుడై !!

(ఆగష్టు 25 సురవరం ప్రతాపరెడ్డి వర్ధంతి..)

-రాధశ్రీ
సెల్: 9494481210

ప్రపంచానికే దీపస్తంభం 'గ్రీన్ నవ యువ భారతం'

కోవిడ్-19 మహమ్మారి విపత్తుతో ప్రపంచ మానవాళి గత రెండేళ్లుగా అతలాకుతలం అవుతున్నది. భారత్‌ను కల్లోల పరిచిన 2వ కరోనా వేవ్ సమసిపోతున్నదని, 3వ అల ప్రభావం అంతగా ఉండకపోవచ్చనే నిపుణుల వార్తలు మనల్ని సంతోషానికి కారణం అవుతున్నది. కరోనా అనంతర సవాళ్ళను ఎదుర్కొనడానికి ప్రపంచ దేశాలు సమాయాత్తం అవుతున్నాయి. వైరస్ ప్రళయంలో ప్రపంచ ఆర్థికం పాతాళాన్ని చవి చూసింది. విశ్వ ఆర్థిక యంత్రానికి ఇంధనం నింపడానికి, ప్రగతి పథంలో అధిక 'గతి శక్తి'తో పయనించడానికి యంత్రాంగాలు పటిష్ట ప్రణాళికలు వేస్తున్నాయి. ఐరాస అంచనాల ప్రకారం ప్రపంచంలో దాదాపు 2 బిలియన్ల యువత (10-25 ఏండ్లు), 1.3 బిలియన్ (15-24 ఏండ్లు) యువత ఉన్నారని, ప్రతి 10 మంది యువతలో 9 మంది అభివృద్ధి చెందుతున్న దేశ యువతే అని తెలుస్తున్నది. అత్యధిక యువత కలిగిన దేశంగా 35.6 కోట్లతో భారత్ అగ్రభాగాన నిలుస్తున్నది. తరువాత స్థానాల్లో చైనా (26.9 కోట్లు), ఇండోనేషియా (6.7 కోట్లు), యుయస్ (6.5 కోట్లు), పాకిస్థాన్ (5.9 కోట్లు), నైజీరియ (5.7 కోట్లు), బ్రెజిల్ (5.1 కోట్లు), బంగ్లాదేశ్ (4.8 కోట్లు)లు ఉన్నాయి. 15 ఏండ్ల లోపు జనాభా భారత్‌లో 26.6 శాతంగా నమోదు అయ్యింది. ప్రపంచవ్యాప్త 20 'యంగెస్ట్' దేశాల్లో 19 దేశాలు ఆఫ్రికాకు చెందినవిగా గుర్తించారు.

కరోనా దెబ్బకు ఆర్థిక మందగమనం, పెట్టుబడుల కోతలు, మానవ వనరుల తగ్గింపు, విద్యాలయాల మూసివేత, ఉద్యోగ ఉపాధుల తరుగుదల లాంటి అవాంఛనీయ సవాళ్ళతో రాబోయే రోజులు కఠినంగా ఉండనున్నాయి. అంతర్జాతీయ అధ్యయనం ప్రకారం 2022-23లో భారతీయుల సగటు వయస్సు 28 ఏండ్లు, చైనీస్ సగటు వయస్సు 37 ఏండ్లు, పశ్చిమ యూరోప్ వాసుల సగటు వయస్సు 45 ఏండ్లుగా ఉండనుంది. ఈ అధ్యయనంతో భారత యువ సత్తువ, ఉజ్వల భవిష్యత్‌కు యువ నైపుణ్య భారతం రాచబాటలు వేయనున్నది. రాబోయే రోజుల్లో నిరుద్యోగ యువత కన్న ఉద్యోగ ఉపాధులు కలిగిన యువత సంఖ్య పెరిగి, ఇండియా రూపురేఖలు మారనున్నాయి. కోవిడ్-19 అకాలంలో జీవవిచ్ఛిన్నం కాని ప్లాస్టిక్ వాడకం, జీవ-వైద్య వ్యర్థాలు పెరగడం, వాతావరణ సానుకూల మార్పుల చర్యల్లో మందగమనంతో ప్రపంచ పర్యావరణ పరిరక్షణ పెద్ద సవాళుగా మారనుంది. ఈ ప్రతికూల మార్పులతో మత్స్య పరిశ్రమ, పర్యాటకం, సముద్ర ఉపరితల రవాణ పరిశ్రమలు 40 బిలియన్ డాలర్ల నష్టాన్ని చవిచూచాయని ఐరాస పర్యావరణ కార్యక్రమ నివేదిక తెలుపుతున్నది. వైరస్ విపత్తుతో ఆర్థిక సంక్షోభం, వాతావరణ ప్రతికూల మార్పులు భయంకర పరిణామాలకు దారి తీస్తున్నాయి. ఈ సవాళ్ళను అధిగమించడానికి దేశ యువ శక్తి చెలిమె దోహదపడాలని, యువ భారత ఉప్పెన దేశ బంగారు భవితకు దోహదపడుతుందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. నేడు భారత శ్రమశక్తితో పారిశ్రామిక ఉత్పత్తి పరుగులిడుతూ, పట్టణీకరణతో పాటు పారిశ్రామికీకరణ వేగంగా జరగాలి. భారత యువజనుల భాగస్వామ్యంతో ప్రజల కొనుగోలు సామర్థ్యాన్ని పెంచగలిగితే డొమెస్టిక్ మార్కెట్, పెట్టుబడుల వెల్లువ, అనంత ఉద్యోద ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. 2030 నాటికి భారతదేశ ఆర్థిక వ్యవస్థ 7 ట్రిలియన్ డాలర్లకు చేరి, ప్రపంచంలోనే 3వ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా గుర్తించబడుతుందని అంచనా వేస్తున్నారు.

పిల్లలు, వృద్ధులతో పోల్చితే యువతకు వాతావరణ మార్పుల పట్ల అవగాహన అధికంగా ఉంటుందని, దీనికి సమాధానంగా 'గ్రీన్ నవ యువతరం' నడుం బిగిస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఐరాస పరిశీలనల ప్రకారం దాదాపు ఒక మిలియన్ యువత పాఠశాలలు, గృహాలు, కమ్యూనిటీల్లో వాతావరణ సానుకూల మార్పులకు సంబంధించిన చర్చలు, తగ్గించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నారని తేలింది. భారత్‌లోని 85 శాతం యువత 'గ్రీన్ జాబ్స్' ఇష్టపడుతున్నారని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. 'క్లైమేట్ ఛేంజ్ పెర్ఫార్మన్స్ ఇండెక్స్-2021' ప్రకారం జి-20 దేశాల్లో ఇండియా, యుకెలు మాత్రమే వాతావరణ సానుకూల మార్పులను కోరుతున్న 10 ప్రముఖ దేశాల జాబితాలో చోటు దక్కించుకున్నాయని తెలుస్తున్నది. సమాజంలో అసమానతలు, యువశక్తి సక్రమ వినియోగానికి కోవిడ్-19 తెచ్చిన లాక్‌డౌన్ నియమ నిబంధనల కల్లోలాలు అడ్డుగా నిలిచాయి. నేడు భారత ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సబ్సిడీ పథకాలు, ఉద్యోగ ఉపాధి కల్పన చర్యలు, పబ్లిక్-ప్రైవేట్-పార్టిసిపేషన్ (పిపిపి)ను ప్రోత్సహించడం, నైపుణ్య యువతను పెంచగల విద్యను అందించడం, ఉద్యోగ కల్పన పథక రచన చేయడం లాంటి చర్యలు భారత్‌ను అగ్ర స్థానంలో నిలుపుటలో సఫలం అవుతాయని ఆశిస్తున్నారు. ప్రపంచదేశాలకు యువ శక్తిని అందించగల ఏకైక భారత యువ దివ్య భవ్య దీపస్తంభం ప్రపంచానికే అభివృద్ధి వెలుగులు పంచాలని ఆశిద్దాం. నైపుణ్య యువ భారతాన్ని అండగా చేసుకొని ప్రపంచదేశాల ప్రేమానురాగాలను దోచుకుందాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

సరుకు ఎగుమతిలో 2021-22 సంవత్సరానికి గాను 400 బిలియన్ డాలర్ల లక్ష్యం-శ్రీ పియూష గోయల్

న్యూఢిల్లీ, ఆగష్టు 24:కేంద్ర వాణిజ్యం, పరిశ్రమలు, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజాపంపిణీ, జౌళీ శాఖల మంత్రి శ్రీ పీయూష్ గోయల్ ఈ రోజు పరిశ్రమ అసోసియేట్‌లతో చర్చించి ఎగుమతులను పెంచడానికి, విస్తరించడానికి తీసుకునే చర్యలపై చర్చించారు. నేటి ఈ సమాలోచనలు ఒక శక్తివంతమైన, బలమైన పరిశ్రమ పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి ఒక దిశా దశను చూపుతుందని చెప్పారు. కోవిడ్ -19 సమయంలో అన్ని పరిశ్రమ సంఘాల నిస్వార్థ సేవా స్ఫూర్తిని శ్రీ పీయూష్ గోయల్ ప్రశంసించారు. సమిష్టి సంకల్పం, చురుకుదనం, సినర్జీలతో మనం 'సంక్షోభాన్ని ఒక అవకాశంగా మార్చాము, ఎందుకంటే ఆగస్ట్ 21 మొదటి 2 వారాల పాటు 2020-21 కంటే 45%, 2019-20 కంటే 32%, సరుకుల ఎగుమతుల కంటే 32% వరకు ఎగుమతులు జరిగాయి. 1 ఏప్రిల్-14 ఆగష్టు 21 కోసం 2020-21 కంటే 71%, 2019-20 కంటే 23% పెరిగింది.

భవిష్యత్తు లక్ష్యాలను ఎలా సాధించాలో ప్రతిబింబించే సమయం కూడా ఇదేనని శ్రీ గోయల్ అన్నారు. 2019 లో 17.6% నుండి భారతదేశంలో సగటు వర్తక దిగుమతి సుంకం 2020 లో 15% కి పడిపోయిందని, దాదాపు దశాబ్దంన్నర కాలంలో వార్షిక పతనం అత్యంత తీవ్రంగా ఉందని అన్నారు. మన వర్తించే సుంకాలు 50.8% (డబ్ల్యూటీఓ) కింద అనుమతించదగిన పరిమితి కంటే తక్కువగా ఉన్నాయని ఆయన అన్నారు. 2021-22లో 400 బిలియన్ డాలర్ల సరుకుల ఎగుమతుల లక్ష్యాన్ని సాధించడానికి భారతదేశం మిషన్ మోడ్‌లో పనిచేస్తోంది.

ఆర్థిక వ్యవస్థలో 2030 నాటికి 2 ట్రిలియన్ అమెరికన్ డాలర్ల ఎగుమతుల లక్ష్యం గురించి మాట్లాడిన శ్రీ గోయల్, ఆర్థిక వ్యవస్థ పునరుజ్జీవన పథంలో పయనిస్తోందని, 2020-21లో భారతదేశం అత్యధిక ఎఫ్‌డిఐ ప్రవాహాన్ని అందుకుందని అన్నారు. ఇది 74.39 బిలియన్ల అమెరికన్ డాలర్ల (2019-20) నుండి 10% పెరిగి 81.72 బిలియన్‌లకు చేరుకుంది. మే 21 లో ఎఫ్‌డిఐ 12.1 బిలియన్ డాలర్లు అంటే మే 20 కంటే 203%, మే 19 కంటే 123% ఎక్కువ. ఈఓడిబి నుండి ఎగుమతుల వరకు మరియు స్టార్టప్‌ల నుండి సర్వీసుల వరకు, భారతదేశం ప్రతి రంగంలో భారీ ఎత్తున దూసుకుపోతోందని మంత్రి చెప్పారు.

ఉపాధి గురించి మాట్లాడుతూ, 54,000 కంటే ఎక్కువ స్టార్టప్‌లు ది 5.5 లక్షల ఉద్యోగాలను అందిస్తున్నాయని, రాబోయే 5 సంవత్సరాలలో 50,000 కొత్త స్టార్టప్‌ల ద్వారా 20 లక్షలకు పైగా ఉద్యోగాలు వస్తాయని అన్నారు. మన పరిశ్రమ మన సామర్థ్యం నిశ్చల ప్రపంచ సరఫరా గొలుసులను అభివృద్ధి చేయడానికి నిబద్ధతను విస్తరించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన అన్నారు. మన నిర్విరామ ప్రయత్నాలు మన సంభావ్య ప్రపంచానికి మరియు భారతదేశ స్కేల్ సామర్థ్యానికి నిదర్శనమని, మన పరిశ్రమలు నిజంగా "సబ్కా సాథ్, సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్, సబ్కా ప్రయాస్" స్ఫూర్తిని నింపాయని ఆయన అన్నారు.

ఆగష్టు 6, 2021 న ప్రధాన మంత్రి స్పష్టమైన పిలుపు గురించి మాట్లాడుతూ "లోకల్ గోల్ గ్లోబల్: మేక్ ఇన్ ఇండియా ఫర్ ది వరల్డ్", నాణ్యత, ఉత్పాదకత మరియు సమర్థత, మన ఎగుమతులను పెద్దవిగా, మెరుగైన, విస్తృతమైన,పరిశ్రమలను మార్చే జీవితాలను మారుస్తుందని ఆయన అన్నారు.

శ్రీ గోయల్ ప్రోత్సాహక తయారీ గురించి కూడా మాట్లాడారు. రాబోయే 5 సంవత్సరాలలో 13 రంగాలకు రూ .1.97 లక్షల కోట్ల విలువైన పిఎల్ఐ పై ప్రభుత్వాల దృష్టి ఉంటుందని, పెట్టుబడులను ఆకర్షించడానికి 24 రంగాలపై దృష్టి పెట్టాలని చెప్పారు. ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్ సెల్ ద్వారా వ్యాపారాలను సులభతరం చేయడానికి వన్-స్టాప్ డిజిటల్ ప్లాట్‌ఫాం (ఐసిసి), ఒక జిల్లా ఉత్పత్తి ఇది, దీని కింద 739 జిల్లాల నుండి 739 ఉత్పత్తుల పూల్ రూపొందుతుంది, పారిశ్రామిక ప్రాంతాల జిఐఎస్ - ఎనేబుల్డ్ డేటాబేస్ అందించడం కోసం ఇండియా ఇండస్ట్రియల్ ల్యాండ్ బ్యాంక్, పరిశోధన ద్వారా జోక్యం చేసుకోవడానికి భారతీయ పరిశ్రమలు ప్రాంతాలను సూచించాలని కేంద్రం భావిస్తుందని కేంద్ర మంత్రి తెలిపారు.

తన ముగింపులో శ్రీ గోయల్ "విజయానికి కీలకం లక్ష్యాలపై దృష్టి పెట్టడం, అడ్డంకులు కాదు" అని అన్నారు. భారతీయ పరిశ్రమ వారి విశ్వాసం,నిబద్ధత ద్వారా మనం ఏ సవాలు ఎదురైనా దానిని జయించవచ్చని ప్రపంచానికి నిరూపించామని ఆయన అన్నారు. సురక్షిత పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేయడంలో ఇండస్ట్రీ అసోసియేషన్లు కీలక పాత్ర పోషిస్తాయని అనగా సుస్థిరమైన, చురుకైన, భవిష్యత్ ఉ సమర్థవంతమైన భారతదేశాన్ని ఉత్పాదక కేంద్రంగా మార్చడానికి మరియు కలిసి, మేము 'సర్వ లోక హితం' అనగా పరిశ్రమ యొక్క అభివృద్ధిని 'నాణ్యత'తో సాధిస్తాం. నడిచే ఉత్పాదకత '.

వాణిజ్య ఉ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ సోమ్ ప్రకాష్ మరియు వాణిజ్య ఉ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీమతి.అనుప్రియ పటేల్ కూడా ఈ సమావేశంలో ప్రసంగించారు.

భారతదేశాన్ని నాలెడ్జ్ ఎకానమిగా తీర్చిదిద్దేందుకు ఎన్ఈపీ ఒక రోడ్‌మ్యాప్‌ను అందిస్తుంది - శ్రీ ధర్మేంద్ర ప్రధాన్

న్యూఢిల్లీ, ఆగష్టు 24:జాతీయ విద్యా విధానం- 2020 భారతదేశాన్ని నాలెడ్జ్ ఎకానమిగా స్థాపించడానికి మరియు ప్రపంచ పౌరుల రూపకల్పనలో సహాయపడటానికి ఒక రోడ్‌మ్యాప్‌ని అందిస్తుందని ఎన్ఈపీ (నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ)తో పాటు కర్ణాటక ప్రభుత్వానికి సంబంధించిన కార్యక్రమాలను ప్రారంభించిన సందర్భంగా కేంద్ర విద్య ఉ నైపుణ్యాభివృద్ధి మరియు వ్యవస్థాపక మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు.కార్యక్రమంలో పాల్గొన్నవారిని ఉద్దేశించి ప్రసంగించిన శ్రీ ప్రధాన్.. జాతీయ విద్యా విధానం 2020 ను అమలు చేయడం ద్వారా కర్ణాటక తన విద్యాభ్యాసాన్ని మార్చడంలో ఒక పెద్ద ముందడుగు వేసింది అని అన్నారు. విజన్ ఎన్ఈపీ-2020 ని అమలు చేసిన భారతదేశంలో మొదటి రాష్ట్రంగా కర్ణాటక తనను తాను నిరూపించుకోవాలనిఆయన అన్నారు. రాష్ట్రంలో ఎన్ఇపి అమలు చేయడం ద్వారా కర్ణాటక ఇతర రాష్ట్రాలకు ఒక ఉదాహరణగా నిలిచిందని మంత్రి న్నారు.భారతదేశ ఎన్ఈపీ దృక్పథం భారతీయ తత్వంతో లోతుగా పాతుకుపోయిందని మంత్రి పేర్కొన్నారు. ఎన్ఈపీ విధాన ఫ్రేమ్‌వర్క్, అమలు వ్యూహం, ఫలితాలు మరియు మానవ సమాజ అభివృద్ధిలో పాత్ర ప్రపంచ విధాన రూపకర్తలకు కేస్ స్టడీగా ఉపయోగపడుతుంది. ఈ రోజు 3-23 సంవత్సరాల వయస్సులో ఉన్న తరం ఎన్ఈపీ ప్రయోజనాలను పొందుతుంది. మరియు భవిష్యత్తులో భారతదేశ గమ్యాన్ని రూపొందిస్తుంది. అయితే భారతదేశం యొక్క పెరుగుతున్న జనాభాను కొత్త విద్యా విధానం పరిధిలోకి చేర్చడం మన ముందు ఉన్న సవాలు అని మంత్రి తెలిపారు.భారతదేశాన్ని ఎన్ఈపీ సరికొత్త ప్రపంచానికి సిద్ధంగా ఉండేలా తీర్చిదిద్దుతుందని శ్రీ ప్రధాన్ నొక్కిచెప్పారు. భారతదేశాన్ని శక్తివంతమైన నాలెడ్జ్ ఎకానమిగా మార్చాలనే తమ జాతీయ ఆశయాన్ని నెరవేర్చడానికి అందరూ సమిష్టిగా పనిచేయాలని ఆయన కోరారు.కర్ణాటక ముఖ్యమంత్రి శ్రీ బసవరాజ్ ఎస్ బొమ్మై, ఉన్నత విద్య, ఐటీ ఉ బిటి, స్కిల్స్ అండ్ టెక్నాలజీ, స్కిల్ డెవలప్‌మెంట్ మరియు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మంత్రి, డా. సి. ఎన్. అశ్వత్ నారాయణ్; ఎన్ఈపీ ముసాయిదా కమిటీ ఛైర్మన్ డాక్టర్ కె. కస్తూరిరంగన్ మరియు ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ఐటిసి సహకారంతో పోలీసులకు శానిటైజర్లు, మాస్కులు పానీయాలు పంపిణి

కరీంనగర్ జూన్ 24(నేటినిజం ప్రతినిధి): కరోనా మూడవదశ ప్రమాదం పొంచిఉన్న నేపథ్యంలో కమిషనరేట్‌లోని అన్నిస్థాయిలకు చెందిన అధికారులకు మాస్కులు, శానిటైజర్లు, రోగనిరోధకశక్తిని పెంపొందించేందుకు దోహదపడే వివిధ రకాల పానియాలను పోలీస్‌శాఖ ఐటిసి సంస్థ సహకారంతో మంగళవారంనాడు పంపిణికి శ్రీకారం చుట్టింది. కరీంనగర్ పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ ఈ కార్యక్రమాన్ని ఐటిసి సంస్థ అధికారులు, ప్రతినిధులతో కలిసి కమిషనరేట్ కేంద్రంలో ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ మాట్లాడుతూ కరోనా వైరస్ మూడవదశ ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని నియంత్రణకోసం పోలీస్‌శాఖ అన్నివర్గాల ప్రజలను అప్రమత్తులను చేసేందుకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నదన్నారు. ప్రజలు తప్పనిసరిగా మాస్కులను ధరించడం, చేతులను శుభ్రంగా తరచూ కడగటం, భౌతికదూరం పాటించడం, రోగనిరోధకశక్తిని పెంపొందించుకునే ఆహారపదార్థాలను తీసుకోవాలని సూచించారు. ఐటిసి సంస్థ పోలీసులకు తమవంతు సహకారం అందించేందుకు ముందుకురావడం అభినందనీయమని చెప్పారు. ప్రజల ఆరోగ్యానికి హానికలిగించే వివిధ రకాల నకిలీ ఉత్పత్తులను విక్రయించే వారిపై చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల రక్షణ,భద్రతకోసం పోలీసులు తీసుకుంటున్న చర్యలకు అన్నివర్గాల ప్రజలు తమవంతు సహకారం అందిస్తూ పోలీసుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఐటిసి డిస్ట్రిబ్యూషన్ పాయింట్ మేనేజర్ ప్రనుష్ మాట్లాడుతూ తమసంస్థ ఉన్నతాధికారులు ఏబియం ఉదయ్, ఏరియా మేనేజర్ శివకుమార్‌ల ఆదేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం రేయింబవళ్ళు శ్రమిస్తున్న పోలీసులకు భవిష్యత్‌లోకూడా తమసంస్థ తరపున సహకారం అందిస్తామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపిలు ఎస్ శ్రీనివాస్(ఎల్అండ్ఓ), జి చంద్రమోహన్(పరిపాలన), ఐటిసి సంస్థ ఏరియా ఏగ్జిక్యూటివ్ రాజు, ఆర్ఐలు మల్లేశం, శేఖర్, మురళీ, రమేష్‌లతోపాటుగా ఐటిసి సంస్థ ప్రతినిధులు, పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

మిషన్ సాగర్‌లో భాగంగా, వైద్య సామగ్రిని అందించడానికి జకార్తా చేరుకున్న ఐఎన్ఎస్ ఐరావత్

న్యూఢిల్లీ, ఆగష్టు 24:భారత నౌకాదళానికి చెందిన ల్యాండింగ్ షిప్ ట్యాంక్ (లార్జ్) ఐఎన్ఎస్ ఐరావత్, ఇండోనేషియా అభ్యర్థించిన 10 ద్రవరూప వైద్య ఆక్సిజన్ (ఎల్ఎంఓ) కంటైనర్లను అందించడానికి జకార్తాలోని టాంజుంగ్ ప్రియోక్ పోర్టుకు ఇవాళ చేరుకుంది.

మిషన్ సాగర్‌లో భాగంగా భారత్ ఇండోనేషియాకు ఈ సాయం అందిస్తోంది. జకార్తాలో వైద్య సామగ్రి దిగడం పూర్తయిన తర్వాత, ఇతర మిత్ర దేశాలకు కూడా వైద్య సామగ్రిని అందించడానికి ఐఎన్ఎన్ ఐరావత్ ముందుకు సాగుతుంది.

ఉభయచర కార్యకలాపాలను నిర్వహించడం ఐఎన్ఎస్ ఐరావత్ ప్రాథమిక పాత్ర. దీంతోపాటు, హెచ్ఏడీఆర్ మిషన్లను కూడా నిర్వహి స్తోంది. గతంలో హిందూ మహాసముద్రంలో చేపట్టిన వివిధ సహాయక చర్యల్లో ఐఎన్ఎస్ ఐరావత్ పాలు పంచుకుంది. ఈ ఏడాది జులై 24న కూడా, ఇండోనేషియాకు 5 ద్రవరూప వైద్య ఆక్సిజన్ కంటైనర్లు (100 మె.ట.), 300 ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లను ఇదే నౌక అందజేసింది.

భారత్, ఇండోనేషియా ఒక బలమైన సాంస్కృతిక బంధం, భాగస్వామ్యం కలిగిన దేశాలు. సురక్షితమైన ఇండో-పసిఫిక్ కోసం సముద్రంపై కలిసి పనిచేస్తున్నాయి. ద్వైపాక్షిక విన్యాసాలు, సమన్వయ గస్తీ రూపంలో ఈ రెండు నౌకాదళాలు ఎప్పటికప్పుడు ఉమ్మడి నావికా విన్యాసాలను కూడా నిర్వహిస్తున్నాయి.

గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్ సిటీ ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్లో ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫైనాన్సింగ్ సర్వీసెస్ ప్లాట్‌ఫామ్‌ను ఏర్పాటు చేయడానికి దరఖాస్తుల ఆహ్వానం

న్యూఢిల్లీ, ఆగష్టు 24:భారతదేశంలోని ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్లో ఆర్థిక ఉత్పత్తులు, ఆర్థిక సేవలు,ఆర్థిక సంస్థలను అభివృద్ధి చేసి నియంత్రించాలన్న లక్ష్యంతో ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్స్ అథారిటీ ఏర్పాటయ్యింది.

గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్ సిటీ ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్లో ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫైనాన్సింగ్ సర్వీసెస్ ప్లాట్‌ఫామ్‌ను ఏర్పాటు చేయడానికి అనుసరించవలసిన విధి విధానాలను ఖరారు చేస్తూ 2021 జూలై 9న ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్స్ అథారిటీ సర్క్యూలర్ జారీ చేసింది.

ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫైనాన్సింగ్ సర్వీసెస్ ప్లాట్‌ఫామ్‌ను నెలకొల్పి, నిర్వహించడానికి ఆసక్తి కలిగిన అర్హత గల సంస్థలు నిర్ణీత విధానంలో అవసరమైన పత్రాలను జతచేసి 2021 సెప్టెంబర్ 15వ తేదీలోగా ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్స్ కు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది.

అర్హతలు కలిగిన సంస్థకు ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్ లో కార్యకలాపాలను ప్రారంభించడానికి అనుమతి ఇస్తారు. పూర్తి స్థాయిలో కార్యకలాపాలను ప్రారంభించడానికి అనుమతులు మంజూరు అయ్యేంత వరకు సంస్థ అనుమతించిన కాలానికి పని చేయవలసి ఉంటుంది. ఎగుమతిదారులు మరియు దిగుమతిదారుల వాణిజ్య ఆర్థిక అవసరాలను సులభతరం చేయడానికి బహుళ ఆర్థిక వనరులను అందుబాటులోకి తీసుకుని రావడానికి ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫైనాన్సింగ్ సర్వీసెస్ ప్లాట్‌ఫామ్ ఒక ఎలక్ట్రానిక్ వేదికగా వ్యవహరిస్తుంది. ప్రపంచ వాణిజ్య సంస్థల నుండి ఎగుమతిదారులు మరియు దిగుమతిదారులకు రుణ సౌకర్యాలను అందుబాటులోకి తీసుకుని రావడానికి ఇది కృషి చేస్తుంది. గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్ సిటీ ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్ జాతీయ అంతర్జాతీయ ఎగుమతి, దిగుమతి దారుల ఆర్థిక సౌకర్యాల కేంద్రంగా గుర్తింపు పొందుతుందని ఆశిస్తున్నారు.

గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్ సిటీ ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్ లో ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫైనాన్సింగ్ సర్వీసెస్ ప్లాట్‌ఫామ్‌ను నెలకొల్పడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తూ 2021 ఆగస్ట్ 23వ తేదీన జారీ అయిన సర్క్యూలర్ ను www.ifsca.gov.in/circularలో చూడవచ్చును.

డీలర్ల డిస్కౌంట్లను పరిమితం చేసినందుకు మారుతి పై 200 కోట్ల రూపాయల జరిమానా విధించిన - సి.సి.ఐ.

న్యూఢిల్లీ, ఆగష్టు 24:తగ్గింపు నియంత్రణ విధానాన్ని అమలు చేయడం ద్వారా ప్రయాణికుల వాహన విభాగంలో పునః విక్రయ ధర నిర్వహణ (ఆర్.పి.ఎం) యొక్క పోటీ వ్యతిరేక ప్రవర్తనకు పాల్పడినందుకు, తదనుగుణంగా, డీలర్లతో సహా మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్ (ఎంఎస్.ఐ.ఎల్) కు వ్యతిరేకంగా, నిలిపివేత-ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు, 200 కోట్ల రూపాయల మేర (రెండు వందల కోట్ల రూపాయలు మాత్రమే) జరిమానా విధిస్తూ, కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సి.సి.ఐ), తుది ఉత్తర్వు ను జారీ చేసింది.

ఎం.ఎస్.ఐ.ఎల్. తన డీలర్లతో ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు సి.సి.ఐ. కనుగొంది. ఈ ఒప్పందం ప్రకారం, ఎం.ఎస్.ఐ.ఎల్. నిర్దేశించిన వాటి కంటే ఎక్కువ డిస్కౌంట్లను వినియోగదారులకు అందించకుండా డీలర్లను నిరోధించారు.

మరో మాటలో చెప్పాలంటే, ఎం.ఎస్.ఐ.ఎల్. దాని డీలర్ల కోసం ఒక 'డిస్కౌంట్ కంట్రోల్ పాలసీ' ని రూపొందించి, అమలు చేస్తోంది. ఈ విధానం ప్రకారం, ఎం.ఎస్.ఐ.ఎల్. తాను అనుమతించిన దానికంటే ఎక్కువగా తగ్గింపులు, ఉచితాలు మొదలైనవి వినియోగదారులకు అందించకుండా, డీలర్లను నిరుత్సాహ పరుస్తోంది. ఒక వేళ, ఎవరైనా ఒక డీలర్ అదనపు డిస్కౌంట్లను అందించాలనుకుంటే, ఎం.ఎస్.ఐ.ఎల్. యొక్క ముందస్తు ఆమోదం తప్పనిసరిగా తీసుకోవాలి. ఈ 'డిస్కౌంట్ కంట్రోల్ పాలసీ' ని ఏ డీలర్ అయినా ఉల్లంఘించినట్లైతే, ఆ డీలర్ తో పాటు, వారి వద్ద పనిచేసే వ్యక్తిగత సిబ్బంది, డైరెక్ట్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, రీజనల్ మేనేజర్, షోరూమ్ మేనేజర్, టీమ్ లీడర్ మొదలైన వారిపై కూడా జరిమానా విధించనున్నట్లు ఎం.ఎస్.ఐ.ఎల్. హెచ్చరించింది.

డిస్కౌంట్ కంట్రోల్ పాలసీ సరిగా అమలౌతోందో లేదో పరిశీలించడానికి, ఎం.ఎస్.ఐ.ఎల్. "మిస్టరీ షాపింగ్ ఏజెన్సీ" లను (ఎంఎస్.ఏ. లను) నియమించింది. వారు ఏ.ఎస్.ఐ.ఎల్. డీలర్ల వద్దకు, వినియోగదారుల మాదిరిగా వెళ్ళి, అదనపు డిస్కౌంట్లు అందిస్తున్నారో లేదో తెలుసుకుంటారు. అదనపు డిస్కౌంట్లు ఇస్తున్నట్లు తెలిస్తే, ఆ ఎం.ఎస్.ఏ. లు తగిన రుజువు (ఆడియో/ వీడియో రికార్డింగ్) లతో ఎం.ఎస్.ఐ.ఎల్. కు యాజమాన్యానికి నివేదిస్తాయి. అప్పుడు, 'మిస్టరీ షాపింగ్ ఆడిట్ రిపోర్ట్' ను జత చేస్తూ, తప్పు చేసిన సంబంధిత డీలర్ కు ఎం.ఎస్.ఐ.ఎల్., ఇ-మెయిల్ పంపుతుంది. అదనపు డిస్కౌంట్ ఇచ్చినట్లు ఆరోపిస్తూ, వివరణ కోరుతూ, తప్పు చేసిన సంబంధిత డీలర్ కు ఎం.ఎస్.ఐ.ఎల్., ఇ-మెయిల్ పంపుతుంది. డీలర్ సమర్పించిన వివరణ, ఎం.ఎస్.ఐ.ఎల్. సంతృప్తి చెందే విధంగా లేని పక్షంలో, డీలర్ల తో పాటు, వారి ఉద్యోగులపై జరిమానాలు విధించబడతాయి, కొన్ని సందర్భాల్లో, సరఫరా నిలిపి వేసే అవకాశం కూడా ఉంది. విధించిన జరిమానా మొత్తాన్ని ఎక్కడ జమ చేయాలనేదీ, జమ చేసిన మొత్తాన్ని ఎలా వినియోగించాలనేదీ, తమ ఆదేశాల ప్రకారం జరగాలని, ఎం.ఎస్.ఐ.ఎల్. నిర్దేశించింది.

ఈ నేపథ్యంలో, ఎం.ఎస్.ఐ.ఎల్. తన డీలర్ల పై "డిస్కౌంట్ కంట్రోల్ పాలసీ" ని విధించడంతో పాటు, వారిపై జరిమానాలు విధించడం, సరఫరా నిలిపివేయడం, పెనాల్టీని వసూలు చేయడం, రికవరీ చేయడం, దాని వినియోగం, కఠినమైన చర్యలు తీసుకోవడం వంటి చర్యలు చేపట్టి, డీలర్ల ను, విధానం అమలును ఎం.ఎస్.ఏ. ల ద్వారా పర్యవేస్తున్నట్లు, సి.సి.ఐ. కనుగొంది,

అందువల్ల, ఎం.ఎస్.ఐ.ఎల్. చేపట్టిన అటువంటి ప్రవర్తన భారతదేశంలో పోటీ పై గణనీయమైన ప్రతిక

బెంగళూరులో మెట్రో రైల్ నెట్‌వర్క్‌ను విస్తరించడానికి 500 మిలియన్ డాలర్ల రుణంపై సంతకం చేసిన - భారతదేశం, ఏ.డి.బి.

న్యూఢిల్లీ, ఆగష్టు 24:బెంగళూరులో మొత్తం 56 కి.మీ పొడవున రెండు కొత్త మెట్రో లైన్ల నిర్మాణంతో మెట్రో రైల్ నెట్‌వర్క్‌ను విస్తరించడానికి 500 మిలియన్ డాలర్ల రుణంపై భారత ప్రభుత్వం మరియు ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏ.డి.బి) 500 మిలియన్ డాలర్ల రుణ ఒప్పందంపై ఈ రోజు సంతకం చేశాయి.

బెంగళూరు మెట్రో రైల్ ప్రాజెక్ట్ కోసం, ఈ ఒప్పందంపై, భారత ప్రభుత్వం తరఫున ఆర్థిక మంత్రిత్వ శాఖలో ఆర్థిక వ్యవహారాల విభాగం అదనపు కార్యదర్శి శ్రీ రజత్ కుమార్ మిశ్రా; ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏ.డి.బి) తరఫున భారత రెసిడెంట్ మిషన్ కంట్రీ డైరెక్టర్ శ్రీ టేకో కొనిషి సంతకం చేసారు.

శ్రీ రజత్ కుమార్ మిశ్రా ఈ సందర్భంగా మాట్లాడుతూ, "కొత్త మెట్రో మార్గాలు బెంగళూరులో సురక్షితమైన, సరసమైన, గ్రీన్ మొబిలిటీ తో పాటు, జీవన నాణ్యతను పెంచడంలో సానుకూల ప్రభావం చూపే విధంగా, పట్టణ ఆవాసాలలో స్థిరమైన వృద్ధి మరియు జీవనోపాధి అవకాశాలను మరింత బలోపేతం చేస్తాయి." అని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా శ్రీ కొనిషి మాట్లాడుతూ, "ట్రాన్సిట్-ఓరియెంటెడ్-డెవలప్‌మెంట్ (టి.ఓ.డి) మరియు మల్టీ-మోడల్ ఇంటిగ్రేషన్ (ఎం.ఎం.ఐ) అనే భావనలతో పట్టణ ప్రజా రవాణా మరియు పట్టణ అభివృద్ధికి మద్దతు ద్వారా బెంగళూరు నగరాన్ని మరింత నివాసయోగ్యమైన, స్థిరమైన నగరంగా మార్చడానికి ఈ ప్రాజెక్ట్ మద్దతు ఇస్తుంది. "రహదారి రద్దీని తగ్గించడం, మెరుగైన పట్టణ నివాస యోగ్యత, పర్యావరణ మెరుగుదలతో సహా వివిధ ప్రయోజనాలను, ఈ ప్రాజెక్ట్ అందిస్తుంది." అని తెలియజేశారు.

టి.ఓ.డి. - ఆధారిత పట్టణ అభివృద్ధి నమూనా అధిక సాంద్రత, సంఘటిత, మిశ్రమ వినియోగం, మిశ్రమ ఆదాయం, సురక్షితమైన, వనరుల-సమర్థవంతమైన మరియు కలుపుకొని పోయే పొరుగు ప్రాంతాలను సృష్టించడం ద్వారా నగరాభివృద్ధిని మెరుగుపరుస్తుంది. నగరం యొక్క దీర్ఘకాలిక పెట్టుబడి అవసరాలను తీర్చడానికి రాష్ట్ర ప్రభుత్వానికి మూలధన ఆదాయాన్ని సృష్టించడం ద్వారా ఈ కారిడార్ల వెంట భూమి విలువలను పెంచడం కూడా టి.ఓ.డి. లక్ష్యం. అదేవిధంగా, ప్రజల-ఆధారిత, పర్యావరణ అనుకూల పరిష్కారాలతో పాటు, బెంగళూరు నివాసితులందరికీ సురక్షితమైన, మొత్తం మొబిలిటీ పరిష్కారాన్ని వివిధ ప్రజా రవాణా వ్యవస్థలను సమగ్రపరచడం ద్వారా అందించాలని, ఎం.ఎం.ఐ. లక్ష్యంగా పెట్టుకుంది.

ఔటర్ రింగ రోడ్డు మరియు 44వ జాతీయ రహదారి వెంబడి, సెంట్రల్ సిల్క్ బోర్డు మరియు కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం మధ్య 30 స్టేషన్లతో, ఈ ప్రాజెక్టు ఎక్కువ ఎత్తులో, రెండు కొత్త మెట్రో లైన్లను నిర్మిస్తుంది. ఇది నగర ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య లేకుండా, ఎటువంటి అవరోధాలు లేకుండా వేగంగా విమానాశ్రయం చేరుకోడానికి సహాయపడుతుంది. వృద్ధులు, మహిళలు, పిల్లలు, వికలాంగుల వంటి బలహీనుల అవసరాలు మెట్రో సౌకర్యాలపై ప్రతిబింబిస్తాయి.

టి.ఓ.డి. మరియు మల్టీమోడల్ ఇంటిగ్రేషన్ పై దృష్టి సారించి, పట్టణ అభివృద్ధి ప్రణాళికలతో పాటు వాటి అమలు విధి విధానాలను రూపొందించడానికి వీలుగా ఏ.డి.బి. నుండి అదనంగా లభించే 2 మిలియన్ డాలర్ల సాంకేతిక సహాయ గ్రాంటు రాష్ట్ర ప్రభుత్వానికి సహాయపడుతుంది. ఈ కార్యక్రమాలను అమలు చేయడానికి వీలుగా, బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ తో పాటు రాష్ట్రానికి చెందిన ఇతర సంస్థల సామర్థ్యాన్ని బలోపేతం చేయడానికి కూడా ఈ గ్రాంట్ ఉపయోగించబడుతుంది.

తీవ్రమైన పేదరికాన్ని నిర్మూలించడానికి తన ప్రయత్నాలను కొనసాగిస్తూ, సంపన్నమైన, కలుపుకొని, స్థితిస్థాపకమైన, స్థిరమైన ఆసియా మరియు పసిఫిక్‌ను సాధించడానికి ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏ.డి.బి) కట్టుబడి ఉంది. 1966 లో స్థాపించిన ఈ బ్యాంకులో 68 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో ఈ ప్రాంతానికి చెందినవారు 49 మంది ఉన్నారు.

ఆదాయ పన్ను విభాగం ఈ-ఫైలింగ్ పోర్టల్‌లో సాంకేతిక లోపాలపై చర్చకు ఇన్ఫోసిస్‌తో ఆర్థిక మంత్రిత్వ శాఖ సమావేశం

న్యూఢిల్లీ, ఆగష్టు 24:ఇన్ఫోసిస్ ఎండీ ఉ సీఈవో శ్రీ సలిల్ పరేఖ్, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి శ్రీమతి నిర్మల సీతారామన్‌తో సమావేశమయ్యారు. ఆలస్యంగా ప్రారంభమైన, ప్రారంభమై రెండున్నర నెలల తర్వాత కూడా ఆదాయ పన్ను విభాగం ఈ-ఫైలింగ్ పోర్టల్‌లో ఇప్పటికీ కొనసాగుతున్న లోపాలపై కేంద్ర ప్రభుత్వం, పన్ను చెల్లింపుదారుల తరఫున తీవ్ర అసంతృప్తిని ఆర్థిక మంత్రి వ్యక్తం చేశారు. పన్ను చెల్లింపుదారులు ఎదుర్కొంటున్న పునరావృత సమస్యలపై ఇన్ఫోసిస్ నుంచి వివరణ కోరారు.పోర్టల్ ద్వారా అందించేందుకు అంగీకరించిన సేవలు ఇప్పటికైనా సక్రమంగా వినియోగదారులకు చేరేలా నిర్ధరించడానికి ఇన్ఫోసిస్ తరఫున మరిన్ని వనరులు మోహరించి, ఎక్కువ ప్రయత్నాలు చేయాల్సిన అవసరం ఉందని ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. పన్ను చెల్లింపుదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పోర్టల్ పనితీరులో జాప్యం కారణంగా తలెత్తే సమస్యలపైనా పరేఖ్‌కు అధికారులు అవగాహన కల్పించారు.పోర్టల్ ద్వారా పన్ను చెల్లింపుదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వచ్చే నెల 15వ తేదీ నాటికి పరిష్కరించాలని పరేఖ్‌కు ఆర్థిక మంత్రి స్పష్టంగా చెప్పారు. దీని వల్ల పన్ను చెల్లింపుదారులు, నిపుణులు పోర్టల్ ద్వారా వారి పని సజావుగా చేసుకుంటారన్నారు.పోర్టల్ సజావుగా పనిచేయడానికి తాను, తన బృందం అవసరమైన ప్రతిదీ చేస్తున్నామని శ్రీ పరేఖ్ వివరించారు. ఈ ప్రాజెక్టులో 750 మంది సభ్యులు పని చేస్తున్నారని, ఇన్ఫోసిస్ సీవోవో ప్రవీణ్‌రావు వ్యక్తిగతంగా ఈ ప్రాజెక్టును పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. పన్ను చెల్లింపుదారులకు ఎలాంటి ఇబ్బంది లేని ఈ-ఫైలింగ్ అనుభవాన్ని అందించడానికి ఇన్ఫోసిస్ వేగంగా పని చేస్తోందని శ్రీ పరేఖ్ హామీ ఇచ్చారు.

టీకాల క్లినికల్ ట్రయల్స్ లో పాలొన్నవారికి కోవిన్ పోర్టల్ ద్వారా డిజిటల్ సర్టిఫికెట్లు

న్యూఢిల్లీ, ఆగష్టు 24:కోవిషీల్డ్ టీకా పనితీరు మీద రెండు, మూడు దశల అనుసంధానానికి 2020 ఆగస్టు నుంచి భారత వైద్య పరిశోధనామండలి (ఐసీఎంఆర్), సీరమ్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎస్ఐఐ) ఉమ్మడిగా అధ్యయనాలు జరిపాయి. మూడో దశ కోవాక్సిన్ సమర్థత పరీక్షలు కూడా నవంబర్ 2020 నుంచి భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ నిర్వహించింది. ఈ పరీక్షలలో పాల్గొన్న వాలంటీర్లకు కోవిన్ పోర్టల్ ద్వారా డిజిటల్ వాక్సినేషన్ సర్టిఫికెట్లు ఇప్పించాల్సిందిగా కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖకు అనేక విజ్ఞప్తులు అందాయి.

ట్రయల్స్ ఫలితాలు సానుకూలంగా వచ్చిన నేపథ్యంలో ఈ విధంగా ట్రయల్స్ లో పాల్గొని టీకాలు తీసుకున్నవారికి టీకా సర్టిఫికెట్లు ఇవ్వాలని మంత్రిత్వశాఖ నిర్ణయం తీసుకుంది. అలాంటి వారికి టీకా సమాచారాన్ని సేకరించటానికి ఐసీఎంఆర్ ను మంత్రిత్వశాఖ నోడల్ ఏజెన్సీ గా నిర్ణయించింది. దీంతో అలాంటి 11,349 మంది జాబితా మంత్రిత్వశాఖకు అందింది. ఫలితంగా కోవాక్సిన్, కోవిషీల్డ్ టీకా ట్రయల్స్ లో పాల్గొన్న వారందరికీ డిజిటల్ వాక్సినేషన్ సర్టిఫికెట్స్ ను కోవిన్ ద్వారా జారీచేశారు.పాల్గొన్నవారందరూ వ్యక్తిగతంగా తమ సర్టిఫికెట్లను కోవిన పోర్టల్, ఆరోగ్య సేతు, డిజిలాకర్ లేదా ఉమాంగ్ యాప్ ద్వారా డౌన్ లోడ్ చేసుకో వచ్చు..

న్యూస్‌ఆన్‌ఎయిర్' రేడియో ప్రత్యక్ష ప్రసారాల ప్రపంచ ర్యాంకులు

న్యూఢిల్లీ, ఆగష్టు 24:'న్యూస్‌ఆన్‌ఎయిర్' ర్యాంకుల ప్రమాణాలకు ఆసక్తికరమైన నూతన అదనపు హంగుగా, ప్రపంచవ్యాప్తంగా ప్రజాదరణ పొందిన ఎయిర్ న్యూస్ 24×7 కార్యక్రమాల ర్యాంకులు కూడా ప్రచురితమయ్యాయి. మార్నింగ్ న్యూస్, సమాచార్ ప్రభాత్, సత్య కే ప్రయోగ్, ఆజ్ సవేరే వంటివి ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ పొందిన ఎయిర్ న్యూస్ 24×7 రేడియో కార్యక్రమాలు.

'న్యూస్‌ఆన్‌ఎయిర్' యాప్‌లో 'ఆల్ ఇండియా రేడియో' ప్రత్యక్ష ప్రసారాలు అత్యంత ప్రాచుర్యం పొందిన ప్రపంచ దేశాల (భారత్ మినహా) తాజా ర్యాంకుల్లో తొలి 10 స్థానాల్లోకి న్యూజిలాండ్ తిరిగి వచ్చింది. 10వ స్థానం నుంచి సౌదీ అరేబియాను కిందకు నెట్టేసి ఆ స్థానాన్ని ఆక్రమించింది.ప్రపంచవ్యాప్తంగా (భారత్ మినహా) ఎయిర్ ప్రసారాల ర్యాంకుల్లో జరిగిన ప్రధాన మార్పులను చూస్తే; ఎయిర్ త్రిస్సూర్, ఎయిర్ అనంతపురి మొదటిసారి మొదటి 10 స్థానాల్లోకి రాగా, ఎయిర్ కొడైకెనాల్, అస్మిత ముంబయి చోటును కోల్పోయాయి. ఎయిర్ చెన్నై రెయిన్‌బో 5వ స్థానం నుంచి 8వ స్థానానికి పడిపోగా, ఎయిర్ కోచి ఎఫ్ఎం రెయిన్‌బో 5వ ర్యాంకుకు చేరింది.ఎయిర్ ప్రసారాల ప్రపంచ దేశాల (భారత్ మినహా) ర్యాంకుల్లో; వివిధ్ భారతి నేషనల్, ఎఫ్ఎం గోల్డ్ దిల్లీ, ఎఫ్ఎం రెయిన్‌బో దిల్లీ, ఎయిర్ కోచి, వివిధ్ భారతి బెంగళూరు కార్యక్రమాలు న్యూజిలాండ్‌లో మంచి ఆదరణ పొందాయి. మధ్యప్రాచ్య దేశాల్లో ప్రసిద్ధి చెందడమేగాక, సింగపూర్, హాంకాంగ్, అమెరికాలోనూ ఎయిర్ త్రిస్సూర్‌కు భారీగా అభిమానులు ఉన్నారు. తొలి 10 దేశాల్లోనూ 'వివిధ్ భారతి నేషనల్' అత్యంత ఇష్టమైన కార్యక్రమంగా కొనసాగుతోంది.

'ఆల్ ఇండియా రేడియో'కు చెందిన 240కి పైగా రేడియో ప్రసారాలు 'ప్రసార భారతి' అధికారిక యాప్ అయిన 'న్యూస్‌ఆన్‌ఎయిర్' యాప్ ప్రసార్‌లో ప్రత్యక్ష ప్రసారం అవుతున్నాయి. 'న్యూస్‌ఆన్‌ఎయిర్' యాప్‌లోని 'ఆల్ ఇండియా రేడియో' ప్రసారాలకు మన దేశంలోనేగాక, ప్రపంచవ్యాప్తంగా 85కు పైగా దేశాలు, 8000 నగరాల్లో పెద్ద సంఖ్యలో శ్రోతలు ఉన్నారు.

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' వేడుకల సందర్భంగా, వివిధ కార్యక్రమాలను ప్రారంభించిన 'నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ'

న్యూఢిల్లీ, ఆగష్టు 24:"ఆజాదీ కా అమృత్ మహోత్సవ్" సందర్భంగా, ఈ నెల 23-27 తేదీల్లో, 'నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ' (ఎంఎన్ఆర్ఈ) వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఎంఎన్ఆర్ఈ వేడుకలకు గుర్తుగా వరుస కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.

సౌర నికర/స్థూల దరఖాస్తుల ప్రక్రియ కోసం కొత్త వెబ్ పోర్టల్ (ష్ట్రబిబిజూబ:// బనీశ్రీజీతీ.ఇ.ష్ట్రట.ణనీల.తిని)ను చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్-కమ్-చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ దేబేంద్ర దలాయ్ చండీగఢ్‌లో ప్రారంభించారు. ఎంఎన్ఆర్ఈ, ప్రపంచ బ్యాంకు, ఈడువై సంస్థ సహకారంతో; 'చండీగఢ్ పునరుత్పాదక శక్తి, శాస్త్ర ఉసాంకేతికత ప్రచార కమిటీ' (క్రెస్ట్) ఈ వెబ్ పోర్టల్‌ను రూపొందించింది. నిర్దిష్ట కాల పద్ధతిలో, పూర్తిగా పేపర్ రహిత ప్రక్రియతో ఈ వెబ్‌సైట్ ఉంటుంది. వ్యవస్థలో పారదర్శకత తీసుకువస్తుంది. పర్యవేక్షణ సమర్థత, వ్యాపారాన్ని సులభతరం చేయడంలో సాయపడుతుంది.

'ఇళ్లపై సౌర పలకల విధానం'పై ప్రజల్లో అవగాహన కల్పించడానికి, జీయూవీఎన్ఎల్, ఇతర డిస్కంల ద్వారా గుజరాత్ అంతటా హోర్డింగ్‌లు, బ్యానర్లు, పోస్టర్లను ఏర్పాటు చేశారు. సోలార్ అంబాసిడర్స్‌గా పిలిచే కార్యకర్తలు ఇంటింటి ప్రచారం కోసం అనేక ప్రదేశాలకు వెళ్లారు. ఈ పథకం, విధానం, రాయితీల సమాచారాన్ని డిజిటల్ రూపంలో పొందేలా వాట్సాప్ చాట్‌బాట్ హెల్ప్‌డెస్క్ నంబర్‌ను ప్రజలకు అందించారు. గుజరాత్ డిస్కంలు చేపట్టిన ఈ వాట్సాప్ కార్యక్రమం దేశంలోనే మొదటిది. వినియోగదారుడు 9724300270 నంబరుకు "హాయ్" అని వాట్సాప్ చేస్తే సరిపోతుంది కాబట్టి, వారి నుంచి మంచి స్పందననూ అందుకుంది.

సోలార్ అంబాసిడర్లు మహారాష్ట్ర, పంజాబ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బంగాల్ రాష్ట్రాల్లో వినియోగదారుల వద్దకు వెళ్లి వారితో సంభాషించారు. ఇళ్లపై సౌర పలకల ఏర్పాటు ప్రయోజనం గురించి వివరించారు.

ఇప్పటికే ఇళ్లపై సౌర పలకలను ఏర్పాటు చేసిన వినియోగదారులు వాటితో సెల్ఫీలు తీసుకుని, సామాజిక మాధ్యమాల్లో ఉంచారు.

ఇళ్లపై సౌర పలకల ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాలు, పునరుత్పాదక విద్యుత్ వనరులను ఎక్కువమంది ఎందుకు స్వీకరించాలన్న విషయాలను వివరిస్తున్న ప్రముఖులు, లబ్ధిదారులు దృశ్య సందేశాలను అధికారులు రికార్డు చేసి, సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు.

ఎంఎన్ఆర్ఈ సమన్వయంతో రాష్ట్ర నోడల్ ఏజెన్సీలు, డిస్కంలు, స్వచ్ఛంద సంస్థల ద్వారా దేశవ్యాప్తంగా ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు ఈ వారంలో జరిగేలా ప్రణాళిక సిద్ధం చేశారు.

నాగరికత, సంస్కృతులకు మూలం జానపద విజ్ఞానమే - ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, ఆగష్టు 24:ఏ దేశ నాగరికత, సంస్కృతికైనా ఆ దేశంలోని జానపద విజ్ఞానమే మూలమని గౌరవ ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. భాష, కళలు, చేతిపనులు, పనిముట్లు, దుస్తులు, ఆచార వ్యవహారాలు, విశ్వాసాలు, వైద్యం, పంటలు, సంగీతం, నృత్యం, ఆటలు, హావభావాలన్నింటి సమాహారమే జానపద విజ్ఞానమని ఆయన తెలిపారు.

ప్రపంచంలోని వివిధ దేశాలకు చెందిన పలువురు జానపద కళాకారులు అంతర్జాల వేదిక ద్వారా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జానపద సంపద లేకుండా భాషాభివృద్ధి, సాంస్కృతిక అభివృద్ధి జరగవని, ఈ రెండింటి పుట్టుక జానపదం నుంచే మొదలైందన్నారు. అమ్మ పాడే లాలిపాటలు, అలసట తెలియకుండా పాడుకునే శ్రామికుల గీతాలు, జీవితాన్ని తెలియజేసే ఆధ్యాత్మిక తత్త్వాలు ఇలా ఏ సాహిత్యాన్ని చూసినా జానపద వాసన స్పష్టంగా కనబడుతుందన్నారు. అలాంటి విలువైన జానపద సంపదను సంరక్షించుకుంటూ భాషా సంస్కృతులను నిరంతరం ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

గ్రామీణ భారతానికీ, జానపదానికి అవినాభావ సంబంధం ఉందన్న ఉపరాష్ట్రపతి, గ్రామీణ ప్రజల జీవితాలనుంచే జానపద కళలు పుట్టాయన్నారు. చేస్తున్న పనిలో ఉత్సాహాన్ని పెంచడంతోపాటు వినోదం కోసం పాటలు, ఆటలు, నృత్యరూపాలతో జానపదాలను పల్లెప్రజలు సృష్టించుకున్నారని ఆయన పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో భారతీయ సంస్కృతి ఉందని తాను తరచూ చెప్పడం వెనక అంతర్యమిదేనని ఉపరాష్ట్రపతి అన్నారు. పల్లెల్లో ఉండే ప్రకృతి రమణీయత, శ్రమ సౌందర్యమే, నిష్కల్మషమైన ఆలోచనలు, తమతోపాటు తోటివారిపట్ల భూతదయతో ఉండటం వంటివన్నీ జానపదాలకు జీవగర్ర అని ఆయన పేర్కొన్నారు. చెట్టు, పుట్ట, పురుగు, పిట్ట.. ఇలా ప్రతీదీ మనిషికి కోసం పుట్టినట్లుగా భావించి వాటికి కూడా జానపద సాహిత్యంలో తగిన గౌరవాన్ని కల్పించారన్నారు. ప్రకృతిని ప్రేమించడం, ప్రకృతితో కలిసి జీవించడం జానపదాల్లో చాలా స్పష్టంగా కనబడుతుందన్నారు.

ఆరంభంలో పల్లె ప్రజల శ్రమను మరిపించేందుకు పుట్టిన జానపదాలు, తదనంతర కాలంలో సామాజిక రుగ్మతల మీద పోరాటానికి ఎంతగానో ఉపయుక్తమయ్యాయన్న ఉపరాష్ట్రపతి, స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజలను చైతన్యవంతం చేయడంలో జానపదాలు పాత్ర కీలకపాత్ర పోషించాయని ఉపరాష్ట్రపతి గుర్తుచేశారు. కరోనా మహమ్మారి సమయంలోనూ ప్రజల్లో నెలకొన్న ఆందోళనలను తొలగించి వారిలో ధైర్యాన్ని కల్పించే విషయంలో ఎందరో జానపద కళాకారులు స్వచ్ఛందంగా ముందుకొచ్చారన్న ఆయన, వారందరికీ అభినందనలు తెలియజేశారు.

ప్రకృతిని, సహజత్వాన్ని, సమాజాన్ని, రస పరిపూర్ణతను ప్రతిబింబించే జానపద సాహిత్యం ఏనాడూ మేధోసంపత్తి హక్కుల (పేటెంట్ రైట్స్) కోసం ప్రయత్నించలేదని ఈ సందర్భంగా గుర్తు చేసిన ఉపరాష్ట్రపతి, మన పెద్దలు జానపద సాహిత్యం ద్వారా తమ భావాలను, స్థానిక సమస్యలను వాటి పరిష్కారంలో తమ అనుభవాల సారాన్ని పాటలు, కథలు, కళల రూపంలో ముందు తరాలకు అందించారన్నారు.

హంగు, ఆర్భాటం లేకుండా సరళమైన, చిన్న చిన్న పదాలతో లోతైన అంశాలను సైతం పండితుల నుంచి పామరుల వరకు సమాజంలోని ప్రతి ఒక్కరికీ స్పష్టంగా తెలియజేయడమే జానపదం గొప్పదనమన్న ఉపరాష్ట్రపతి, సంగీతానికి, నృత్యానికి ఉన్న శాస్త్రీయతే జానపదాలకూ ఉందన్నారు. వీధినాటకాలు, తోలుబొమ్మలాటలు, బుర్రకథలు, యక్షగానాలు, జముకుల కథలు, పగటి వేషాలు వంటి వందలాది జానపద కళారూపాలు ఆ రోజుల్లో పల్లె ప్రజలకు విజ్ఞానాన్ని, వినోదాన్ని పంచాయన్న ఆయన, భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతిబింబించే భారతదేశంలో ప్రతి రాష్ట్రానికి తమదైన ప్రత్యేక జానపద కళారూపాలున్నాయన్నారు.

ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి తన చిన్ననాటి సంగతులను గుర్తుచేసుకుంటూ.. పండుగ రాగానే తోలుబొమ్మలాట, కోలాటాలు, సంక్రాంతి సమయంలో హరిదాసులు, గంగిరెద్దులతో ఊరంతా కోలాహలంగా ఉండేదన్నారు. రైతులు తాము పండించిన దాంట్లో కొంత భాగాన్ని కళాకారులకు పంచి, ఎన్నో విశేషాలు వారి నుంచి తెలుసుకునే వారన్నారు. రేడియో, సినిమా, టీవీల ప్రాధాన్యత పెరగక ముందు జానపద కళారూపాలే ప్రధాన వినోద సాధనాలుగా ఉండేవని ఆయన తెలిపారు.

ఇంతటి విలువైన జానపద సంపదను కాపాడుకునేందుకు ఈ సాహిత్యాన్ని పుస్తకాల రూపంలో అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని ఉపరాష్ట్రపతి అన్నారు. జానపద సాహిత్యం మీద విశ్వవిద్యాలయ స్థాయిల్లో పరిశోధనలు జరుగుతున్నప్పటికీ, ఆ ప్రయత్నాలు మాత్రమే సరిపోవడం లేదన్నారు. యువతకు జానపద సాహిత్యం మీద అవగాహన కల్పించడంపై జానపద కళాకారులు, భాషావేత్తలు, ఉన్నతవిద్యాసంస్థలు మరింత దృష్టిసారించాలన్నారు. జానపద విజ్ఞానాన్ని కాపాడుకుని ముందు తరాలకు అందించేందుకు కళాకారులు సైతం సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ, సృజనాత్మక విధానాల మీద దృష్టి పెట్టాలని తెలిపారు. మాతృభాషను కాపాడుకోవడంలో జానపదాల పాత్రను విస్మరించకూడదని ఉపరాష్ట్రపతి దిశానిర్దేశం చేశారు.

సినిమా, టీవీ, రేడియో జానపదాలకు ప్రాధాన్యత మరింత పెంచాలని సూచించిన ఉపరాష్ట్రపతి, భారతీయ యువతలో అద్భుతమైన తెలివి తేటలు ఉన్నాయని, వాటిని మన సంస్కృతి వైపు మరలించి, అద్భుతాలు సాధించేలా చేయగల శక్తి జానపదాలకు ఉందని తెలిపారు. ఈ దిశగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని తెలిపారు. ఇదే వేదిక నుంచి ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్రకేసరి శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు 150వ జయంతి సందర్భంగా నివాళులు అర్పించారు. వారి దేశభక్తి, ధైర్యసాహసాలు, త్యాగనిరతిని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ప్రముఖ జానపద గాయకుడు శ్రీ దామోదరం గణపతి రావు, జానపద పరిశోధకులు డా. సగిలి సుధారాణి, జానపద గాయకుడు డా. లింగ శ్రీనివాస్ సహా దేశవిదేశాలకు చెందిన జానపద కళాకారులు, జానపద కళాభిమానులు అంతర్జాల వేదిక ద్వారా పాల్గొన్నారు.

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద భువన్ "యుక్త ధార" కింద కొత్త పోర్టల్: కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, ఆగష్టు 24:రిమోట్ సెన్సింగ్ మరియు జీఐఎస్ ఆధారిత సమాచారాన్ని ఉపయోగించి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆస్తుల ప్రణాళికను రూపొందించడానికి "యుక్త ధార" పోర్టల్ ఉపయోగపడుతుందని కేంద్ర శాస్త్ర సాంకేతిక, భూ శాస్త్రం, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్లు, అణుశక్తి, అంతరిక్ష శాఖల మంత్రి శ్రీ జితేంద్ర సింగ్ అన్నారు. "యుక్త ధార" పోర్టల్ ను ప్రభుత్వం ఈ రోజు ప్రారంభించింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, సమగ్ర నీటి యాజమాన్య పథకం, ప్రతి నీటి బొట్టుతో అదనపు దిగుబడి,రాష్ట్రీయ కృషి వికాస్ యోజన లాంటి పథకాల కింద అభివృద్ధి చేసిన ఆస్తుల (జియో ట్యాగ్) ఫొటోలతో సహా పూర్తి వివరాల భాండాగారంగా "యుక్త ధార" ఉంటుందని మంత్రి పేర్కొన్నారు.

"యుక్త ధార" విడుదల సమావేశంలో పాల్గొన్న కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి శ్రీ శ్రీ గిరిరాజ్ సింగ్ వికేంద్రీకృత విధానంలో నిర్ణయాలను తీసుకుని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి జరుగుతున్న కృషికి "యుక్త ధార" దోహదపడుతుందని అన్నారు. 'యుక్త' అంటే ప్రణాళిక 'ధార 'అంటే ప్రవాహం అని ఆయన వివరించారు. గ్రామీణ ప్రణాళికలో జి 2 జి సేవలను అందించడానికి ఇస్రో తో కలసి గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ చేస్తున్న ప్రయత్నాలకు "యుక్త ధార" తుదిరూపు ఇస్తుందని మంత్రి చెప్పారు.

ఇస్రో నిర్వహిస్తున్న భువన్ పోర్టల్ ఉపగ్రహ ఛాయా చిత్రాలు, విశ్లేషణలతో విలువైన సమాచారాన్ని అందిస్తున్నదని డాక్టర్ సింగ్ పేర్కొన్నారు. దీనిని ఆధారంగా చేసుకుని ప్రభుత్వం అభివృద్ధి ప్రణాళికలకు రూపకల్పన చేస్తున్నదని మంత్రి వివరించారు.

నూతనంగా ప్రారంభించిన "యుక్త ధార" పోర్టల్ భౌగోళిక సమాచారాన్ని అధునాతన సాధనాలతో విశ్లేస్తుందని డాక్టర్ సింగ్ తెలిపారు. దీని ఆధారంగా ప్రణాళిక వేత్తలు గతంలో వివిధ పథకాల కింద అభివృద్ధి చేసిన ఆస్తులు సౌకర్యాలను విశ్లేషించి నూతన కార్యక్రమాలకు రూపకల్పన చేస్తారని ఆయన తెలిపారు. రాష్ట్రాలకు చెందిన శాఖలతో కలసి సంబంధిత అధికారులు ప్రణాళికలను పరిశీలించి తగిన వాటిని గుర్తిస్తారని అన్నారు. క్షేత్ర స్థాయి అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలను రూపొందించి వాటిని అమలు చేయడానికి అవసరమైన నిధులను సమకూర్చే అంశంలో "యుక్త ధార"కీలక పాత్ర పోషిస్తుంది. దీనివల్ల పథకాల జీవిత కాలం పెరగడానికి, వీటిపై నియంత్రణ కలిగి ఉండడానికి అవకాశం కలుగుతుంది.

భువన్ లో జియో సౌకర్యంతో పొందుపరచిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వివరాలకు అన్ని వర్గాల నుంచి ఆదరణ లభించింది. జియో టాగింగ్ చేయడానికి ముందు జియో టాగింగ్ చేసిన తరువాత లభిస్తున్న వివరాల ఆధారంగా చేసుకుని సమకూరుస్తున్న నిధులు సక్రమంగా వినియోగం అవుతున్నాయి. దీనితోపాటు గ్రామీణ ప్రాంతాల్లో విలువైన ఆస్తులు ఏర్పడుతున్నాయి. జన్ మన్రేగా మొబైల్ సాధనం ద్వారా భువన్ సేవలను వినియోగిస్తూ ప్రజల నుంచి అభిప్రాయాలను తెలుసుకోవడానికి అవకాశం కలుగుతుంది. జియోగ్రాఫిక్ సమాచారం మరియు ఎర్త్ అబ్జర్వేషన్ టెక్నాలజీలను అనుసంధానం చేయడం వల్ల గ్రామీణ ప్రాంతాలలో ఆస్తుల విలువపెరగడమే కాకుండా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యక్రమం అమలులో పారదర్శకతను తీసుకువచ్చిందని ఆయన వివరించారు.

ప్రపంచంలో తొలిసారిగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లాంటి భారీ ప్రణాళిక కు సంబంధించిన సమాచారాన్ని అందుబాటులోకి తీసుకుని రావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని మంత్రి అన్నారు. గ్రామీణాభివృద్ధి శాఖకు అవసరమైన సమాచారాన్ని అందించే అంశంలో రాష్ట్రాలు అందిస్తున్న తోడ్పాటుతో ఈ కార్యక్రమం అమలు జరుగుతుందని మంత్రి వివరించారు.

సంఘ విద్రోహ చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవు జిల్లా ఎస్

వకుళాభరణాన్ని సత్కరించిన శిష్టకరణ సంఘం సభ్యులు

హైదరాబాద్ , ఆగష్టు 24:తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మెన్‌గా నియమితులైన సామాజిక వేత్త, బీసీ ఉద్యమాల నాయకుడు డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్‌రావును శిష్టకరణ సంక్షేమ సంఘం నాయకులు మంగళవారం సత్కరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు, జాతీయ శిష్టకరణ ఓబీసీ సాధన కమిటీ కన్వీనర్ డీవీ కృష్ణారావు, తెలంగాణ రాష్ట్ర శిష్టకరణ సంక్షేమ సంఘం నాయకులు మంగళవారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా కృష్ణ మోహన్ మాట్లాడుతూ బీసీ కులాల అభ్యున్నతికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. బీసీలకు ఉన్నత పదవులను అందించడంతో పాటు అన్ని రంగాలలో అవకాశాలను కల్పిస్తూ వారి ఉన్నతికి తోడ్పడు తుండడం సంతోషంగా ఉందన్నారు. బీసీ కమిషన్ ఛైర్మెన్‌గా నియమించడంపై ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీసీల అభ్యున్నతికి అన్ని వేళాల అందుబాటులో ఉంటూ వారి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శిష్టకరణ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, అడిషనల్ ప్రధాన కార్యదర్శి మోటూరి నారాయణ రావు, కోశాధికారి ఉరిటి పార్వతీశ్వర రావు, సలహాదారులు పార్థసారధి, శంకర్ పట్నాయక్, ప్రతాప్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద రహిత రహదారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం : సందీప్ శ్యాండిల్య

సంగారెడ్డి, ఆగష్టు 24:: ప్రమాద రహిత రహదారులుగా నేషనల్ హైవేలను తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తామని రోడ్ సేఫ్టీ అడిషనల్ డీజీపీ సందీప్ శ్యాండిల్య అన్నారు. మంగళవారం కంది మండలం లోని ఐఐటీ హైదరాబాద్‌లో జిల్లా ఎస్పీ రమణకుమార్, మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్టు హైవేస్ రీజినల్ అధికారి కె.కుశ్వాహ ఆధ్వర్యంలో జాతీయ రహదారులపై తరచూ జరుగుతున్న ప్రమాదాలను ఎలా నివారించాలనే అంశంపై సుదీర్ఘంగా చర్చించారు.

ఈ చర్చలో ప్రధానంగా ఎన్‌హెచ్-65 పై గతంలో జరిగిన రోడ్డు ప్రమాదాలు, వాటికి గల కారణాలను విశ్లేషించారు. ఇదే రహదారిపై ఉన్న బ్లాక్ స్పాట్ ఎక్కడ ఉన్నాయి, అక్కడ ప్రమాదాలు జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా ఐఐటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరిశోధనలు నూతన సాంకేతికత ఆధారంగా రోడ్డు ప్రమాదాలను ఏ విధంగా నివారించవచ్చు అనే అంశాలను ప్రస్తావించారు.

వీటితో పాటు పాదచారులు రోడ్డు దాటడానికి అవసరమైన ఫుట్ ఓవర్ బ్రిడ్జ్, అండర్ పాస్‌ల నిర్మాణ, వాటి ఏర్పాటులో ఉన్న ఇబ్బందులు ఏమిటి అని చర్చించుకున్నారు. రోడ్లపై ఏ ఏ ప్రాంతాల్లో సూచిక బోర్డులను ఏర్పాటు, జంక్షన్ సమీపించే ముందు వాహన వేగాన్ని ఎలా అదుపు చేయవచ్చు అనే వివరాలను సేకరించారు.

కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ నేషనల్ హైవేస్ ఎస్.ఇ శ్రీనివాస్, ఐఐటీ ప్రొఫెసర్ దిగ్విజయ్ పవార్‌లతో పాటు ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు, పటాన్‌చెరు, సంగారెడ్డి డీఎస్పీలు భీమ్‌రెడ్డి, బాలాజీ, సంగారెడ్డి రూరల్ సీఐ శివలింగం, ట్రాఫిక్ సీఐ ముజీబ్ ఉర్ రహ్మాన్, పటాన్‌చెరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, వేణుగోపాల్, మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ ఏ.చంద్రశేఖర్, మియాపూర్ ట్రాఫిక్ సీఐ ఎన్.సుమన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యం..సమగ్రాభివృద్ధే మా లక్ష్యం:విప్ ఆరెకపూడి గాంధీ

హైదరాబాద్ , ఆగష్టు 24:మియాపూర్:కరోనా వంటి విపత్కర పరిస్థితులు నెలకొన్నా ఓ వైపు ప్రజారోగ్యాన్ని కాపాడుకుంటూనే మరోవైపు ప్రజల సౌకర్యం కోసం సమగ్రాభివృద్ధితో ముందుకు సాగుతున్నట్లు ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల సంపూర్ణ తోడ్పాటుతో అభివృద్ధిలో ఏమాత్రం లోటు రానివ్వకుండా చూసుకుంటున్నామన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం కూకట్‌పల్లి డివిజన్ ఆస్‌బెస్టాస్ కాలనీలో రూ. 1,01,70,000లతో చేపట్టనున్న యూజీడీ, సీసీ రోడ్డు పనులకు కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, దొడ్ల వెంకటేశ్ గౌడ్, మాజీ కార్పొరేటర్ రంగారావు, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి విప్ ఆరెకపూడి గాంధీ మంగళవారం శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లలో మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా పనులను చేపడుతున్నామని, రహదారులు, తాగునీరు, విద్యుత్, డైనేజీ సౌకర్యాలను కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ముంపు సమస్యల్లేకుండా వరద నీటి కాలువలు, మురుగు సమస్యల్లేకుండా డైనేజీ వ్యవస్థ, దుర్వాసనలు రాకుండా ఎస్టీపీలు సహా మరెన్నో అభివృద్ధి పనులను సమానంగా చేపడుతున్నామని విప్ గాంధీ తెలిపారు.

అనంతరం కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికై కార్పొరేటర్లు, అధికారులతో కలసి ఆస్బెస్టాస్ కాలనీలో పాదయాత్ర చేపట్టారు. కాలనీలో డైనేజీ, తాగునీరు, విద్యుత్ వంటి సమస్యలను స్థానికులు విప్ గాంధీ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలన్నింటినీ దశలవారీగా పరిష్కరించి కాలనీని అభివృద్ధి పరుస్తానని విప్ గాంధీ హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఈఈ గోవర్ధన్, ఏఈ శివప్రకాశ్,పార్టీ నేతలు సంజీవరెడ్డి, జిల్లా గణేశ్,నాగేశ్వర్‌రావు, ప్రసాద్, ఖయ్యూమ్, కాశీనాథ్, మోహన్, హర్షద్‌యు,రఫిక, జ్యోతి, రాధాబాయి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

2020-21 ఆర్థిక సంవత్సరంలో డిజిటల్ స్వీకరణకు పోటీ పుంజుకుంది

బెంగళూరు, ఆగస్టు 20: ప్రముఖ డిజిటల్ చెల్లింపులు మరియు బ్యాంకింగ్ టెక్నాలజీ కంపెనీ క్యాష్‌ఫ్రీ, జూలై 2020 నుండి జూలై 2021 వరకు వ్యాపారులలో డిజిటల్ స్వీకరణలో క్రమంగా మరియు క్రమబద్ధమైన పెరుగుదలను హైలైట్ చేస్తూ, యాక్టివ్/ ట్రాన్సాక్టింగ్ వ్యాపారులలో 150 శాతం పెరుగుదలను నమోదు చేసినట్లు ప్రకటించింది. అదే సమయంలో, వ్యాపారి సైన్-అప్‌ల సంఖ్య జూలై 2020 లో సుమారు 70000 నుండి జూలై 2021 లో 130000 కంటే ఎక్కువ పెరిగింది, ఇది 95 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఆసక్తికరంగా, మొత్తంమీద వ్యాపారి సైన్-అప్‌లలో దాదాపు 30 శాతం ఇ-కామర్స్ రంగం నుండి వచ్చాయి, తరువాత డిజిటల్ వస్తువులు మరియు ఎడ్-టెక్ రంగం దగ్గరలో ఉన్నాయి. భారతదేశంలో వ్యాపారులు చెల్లింపులను సేకరించడానికి మరియు అందుబాటులో ఉన్న అన్ని పద్ధతుల ద్వారా సులభమైన అనుసంధానంతో చెల్లింపులు చేయడానికి వీలు కల్పిస్తూ, క్యాష్‌ఫ్రీ పూర్తి-స్టాక్ చెల్లింపు పరిష్కారాలను అందిస్తుంది.

గత ఒక సంవత్సరంగా, మహమ్మారి పరిస్థితి వలన వినియోగదారులు మరియు వ్యాపారులు ఇద్దరికీ అత్యధిక స్థాయిలో డిజిటల్ స్వీకరణ రేటుకు దారితీసింది. మహమ్మారి సమయంలో, ముఖ్యంగా రెండవ వేవ్ సమయంలో వ్యాపారుల మధ్య డిజిటల్ చెల్లింపులను పెంచడం ఈ పెరుగుదలకు ముఖ్య కారణం, ఇది కఠినమైన లాక్డౌన్ చర్యలు మరియు సామాజిక దూర నిబంధనలకు దారితీసింది. ఇది భౌతిక చెల్లింపు పద్ధతులను తగ్గించి, డిజిటల్ ఎంపికలను అవలంబించాల్సిన అవసరాన్ని ముందుకు తెచ్చింది. ఇది ముఖ్యంగా టైర్ 2-టైర్ 3 భారతదేశంలో స్పష్టంగా కనిపిస్తుంది, ఇక్కడ డిజిటల్ చెల్లింపు ఎంపికల సౌలభ్యం, సామాజిక-దూర నిబంధనలను పాటించాల్సిన అవసరంతో కలిపి మొత్తం వినియోగదారుల స్థావర వృద్ధికి దోహదపడే కొత్త భౌగోళికాల ఆవిర్భావం కనిపించింది.

క్యాష్‌ఫ్రీ సీఈఓ మరియు సహ వ్యవస్థాపకుడు ఆకాష్ సిన్హా మాట్లాడుతూ, "మహమ్మారి వ్యాపారాలు తమ మొత్తం చెల్లింపు నిర్వహణ ప్రక్రియలను పునరాలోచించడానికి దారితీసింది. క్యాష్‌ఫ్రీలో, మేము భారతీయ వ్యాపారుల ప్రపంచ అవసరాలను తీర్చడానికి అనుకూలీకరించదగిన ఉత్పత్తుల సముదాయాన్ని రూపొందించడానికి ఖచ్చితమైన క్రెడిట్ అసెస్‌మెంట్ మరియు అనుకూలీకరించిన పరిష్కారాల కోసం ఆవిష్కరణలు మరియు అంచనా విశ్లేషణలను ఉపయోగిస్తున్నాము. ఇ-కామర్స్ రంగం నుండి వ్యాపారులు, ప్రారంభంలో స్వీకరించిన వారిలో ఒకరు. వారు మొత్తం మీద మా మర్చంట్ సైన్-అప్ బేస్‌లో దాదాపు 26% దోహదం చేస్తారు, తరువాత డిజిటల్ వస్తువులు మరియు ఎడ్-టెక్ రంగం. ఇండోర్, జైపూర్, లక్నో వంటి భారతదేశ లోపలి ప్రదేశాలలో మా సేవలను తెరవడానికి కూడా ఇది సహాయపడింది. బ్యాంక్ ఖాతా ధృవీకరణ ఎఫ్ఎ మరియు ఆటో కలెక్ట్ - కస్టమర్‌లకు ఇన్‌బౌండ్ చెల్లింపులకు సరిపోయే వర్చువల్ అకౌంట్ సొల్యూషన్ నుండి, భారతదేశంలోని వ్యాపారాలు తమ అవసరాలను తీర్చే సాంకేతికతలకు క్యాష్‌ఫ్రీ ప్రాప్యతను కలిగి ఉండేలా చూసుకోవడానికి నిరంతరం ప్రయత్నిస్తున్నారు."

ప్రస్తుతం, క్యాష్‌ఫ్రీ క్లయింట్ జాబితాలో క్రెడ్, బిగ్‌బాస్కెట్, జొమాటో, హెచ్‌డిఎఫ్‌సి ఎర్గో, ఇక్సిగో, అకో, జూమ్‌కార్ మరియు ఢిల్లీవేరీ వంటి ప్రముఖ పేర్లు ఉన్నాయి.

నూతన మరియు పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో "ఆజాది కా అమృత్ మహోత్సవ్ "

న్యూఢిల్లీ, ఆగష్టు 24:ఆగష్టు 23 నుంచి 27 వ తేదీ వరకు జరగనున్న "ఆజాది కా అమృత్ మహోత్సవ్ " వారోత్సవాల్లో వివిధ కార్యక్రమాలను నిర్వహించడానికి నూతన మరియు పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ సన్నాహాలు చేస్తున్నది.

వారోత్సవాల్లో భాగంగా రైతులకు పీఎం-కుసుమ్, ఇళ్ల పైకప్పులపై సౌర విద్యుత్ రెండవ దశపై మరింత అవగాహన కల్పించేలా కార్యక్రమాలను నిర్వహించాలని నూతన మరియు పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. 2019 మార్చి నెలలో ప్రారంభం అయిన ఈ రెండు పథకాలు దాదాపు అన్ని రాష్ట్రాల్లో అమలవుతున్నాయి.

ఆన్‌లైన్ ద్వారా శిక్షణా తరగతులు, వెబినార్లు, నిపుణులు లబ్ధిదారుల మధ్య చర్చా కార్యక్రమాలను నిర్వహించడం తో పాటు కోవిడ్-19 నిబంధనలను పాటిస్తూ భౌతికంగా కూడా కార్యక్రమాలను నిర్వహించాలని మంత్రిత్వ శాఖ నిర్ణయించింది.

ఈ వారంలో వివిధ రాష్ట్రాల్లో వివిధ కార్యకలాపాలను నిర్వహిస్తూనే ఇతర కార్యకలాపాలు కూడా నిర్వహించనున్నారు.

ఇళ్ల పై భాగంలో సౌర విద్యుత్ సౌకర్యాలను ఏర్పాటు చేయడానికి అవసరమైన ధరఖాస్తులను వినియోగదారుల నుంచి స్వీకరించి వాటిని పరిశీలించడానికి చండీగఢ్ రెన్యూవబుల్ ఎనర్జీ సొసైటీ ఆన్‌లైన్ విధానాన్ని ప్రారంభించనున్నది.

సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించడానికి అంబాసిడర్లుగా నియమితులైన వారు ఈ వారంలో వినియోగదారులను కలుసుకుని సౌర విద్యుత్ ఉపయోగించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ, దీనిని ఎలా పొందాలన్న అంశంపై వివిధ రాష్ట్రాల్లో ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఇళ్ల పై భాగాలపై సౌర విద్యుత్ ని ఏర్పాటు చేసుకోవడానికి అయ్యే ఖర్చు, దీనివల్ల కలిగే ఆదా తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు.

ఇప్పటికే సౌర విద్యుత్ ని ఉపయోగిస్తున్న వారితో కలిసి అంబాసిడర్లు ఫోటోలను తీసుకుని వాటిని సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తారు.

ఈ పథకం ప్రయోజనాలను వివరిస్తూ ప్రముఖ వ్యక్తులు మరియు లబ్ధిదారులు రూపొందించే వీడియోలను కూడా మంత్రిత్వ శాఖ ప్రసారం చేయడానికి ప్రణాళిక సిద్ధం చేసింది. ఇప్పటికే సౌర విద్యుత్ ఉపయోగిస్తున్నవారు దీనివల్ల తాము పొందుతున్న ప్రయోజనాలను వివరిస్తూ రూపొందించే కార్యక్రమాలను సోషల్ మీడియాలో ఉంచుతారు.

సౌర నగరాలుగా అభివృద్ధి చేయడానికి ఇప్పటికే 20 రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాలు నగరాలను గుర్తించాయి. సౌర నగరాలుగా మారడానికి కోణార్క్, మొధేరా (సూర్య దేవాలయ నగరాలు) సిద్ధం అవుతున్నాయి. ఈ నగరాల్లో అమలు చేయడానికి అవకాశం ఉన్న ప్రాజెక్టులపై సంబంధిత వర్గాలతో కలసి ప్రతి రాష్ట్రం గంటసేపు సాగే సదస్సు నిర్వహిస్తుంది.

వికేంద్రీకృత పునరుత్పాదక ఇంధన ఉత్పత్తులపై ఆన్‌లైన్ లో లబ్ధిదారులు, గ్రామ స్థాయి పారిశ్రామికవేత్తలకు శిక్షణా తరగతులను నిర్వహించడం జరుగుతుంది.

IN THE COURT OF THE M.A.C.T-CUM-XII ADDL CHIEF JUDGE: CITY CIVIL COURT AT SECUNDERABAD
M.V.O.P. NO.494 OF 2019

Between:
Mr. G. Jairam Reddy and another
.....Petitioner
And
Mr. Anwar Khan and others
..Respondents

Mr. Gollapally Satyanarayana
S/o.G. Pandurangam,
Age: Major, Occ: Owner of Lorry bearing No.AP 13X 0432, H.No. 12-4-6145/A, Asif Nagar, Hyderabad.
..Respondent No.2

Whereas the above named Petitioners filed compensation petition against you and National Insurance co. Ltd for a sum of Rs 15,00,000/- for the accident caused by your vehicle Lorry bearing No.AP 13X 0432, on 10-08-2019 at Moina bad ps Limites. The above case is posted to **01-09-2021.** You are hereby summon to appear either in person or through pleader with your defence if any at 10.30 A.M. on the above said date before the Hon'ble Court, failing which the suit will be heard and determined expate.

(BY ORDER OF THE Honble COURT)

C. VENU GOPAL REDDY
A.POORNA CHANDRA RAO
Advocates.
off: 2-4-120/18,
Swaroop Nagar
Uppal, Hyderabad
Ph: 9440431541

పారాలింపిక్ క్రీడల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తామన్న నమ్మకంతో భారత నీటి క్రీడాకారులు

న్యూఢిల్లీ, ఆగష్టు 24:భారతదేశానికి చెందిన ముగ్గురు సభ్యుల వాటర్ స్పోర్ట్స్ ప్రతినిధి బృందంలో ఇద్దరు పురుష స్విమ్మర్లు మరియు ఒక మహిళా కానో స్ప్రింట్ అథ్లెట్ ఉన్నారు.

సుయాష్ జాదవ్‌కు ఇది అతని 2 వ పారాలింపిక్ గేమ్స్ కాగా..నిరంజన్ ముకుందన్ మరియు ప్రాచీ యాదవ్ మొదటిసారి టోక్యోలో అతిపెద్ద వేదిక వద్ద తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు.విదేశీ ఎక్స్‌పోజర్ పరంగా సుయాష్‌కు భారత ప్రభుత్వం నుండి సహాయం అందించబడింది.నిరంజన్ 60 కి పైగా అంతర్జాతీయ పతకాలను సాధించారు మరియు 50 పతకాల మార్కును దాటిన ఏకైక పారా స్విమ్మర్.ప్రాచి యాదవ్ 26 పారాలింపిక్ గేమ్స్ పారా కానోయింగ్ పోటీలో ప్రవేశించిన మొదటి భారతీయురాలు.

ఇద్దరు పురుష స్విమ్మర్లు మరియు ఒక మహిళా కానో స్ప్రింట్ అథ్లెట్‌తో కూడిన భారతదేశానికి చెందిన ముగ్గురు సభ్యుల వాటర్ స్పోర్ట్స్ ప్రతినిధి బృందం టోక్యోలో జరిగే పారాలింపిక్ గేమ్స్‌లో తమ అత్యుత్తమ ప్రదర్శనలను ప్రదర్శిస్తుందని ఆశిస్తున్నారు. సుయాష్ జాదవ్‌కు ఇది 2 వ పారాలింపిక్ గేమ్స్ కాగా, నిరంజన్ ముకుందన్ మరియు ప్రాచీ యాదవ్ మొదటిసారి టోక్యోలో అతిపెద్ద వేదిక వద్ద తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. ఈ ముగ్గురు టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్ (టాప్స్) లో భాగం.

2018 జకార్తాలో జరిగిన ఆసియా పారా గేమ్స్ పురుషుల 50 మీటర్ల బటర్‌ఫ్లై ఎస్ 7 (32.71 సెకన్లు) లో సుయాష్ జాదవ్ విజయం అతనికి టోక్యో పారాలింపిక్స్‌కి ప్రవేశాన్ని కల్పించింది. వాస్తవానికి పురుషుల 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లీ ఎస్ఎం7 (2: 51.39) లో అతని కాంస్య పతకం కూడా టోక్యో పారాలింపిక్స్‌లో ఈవెంట్‌లో అతనికి స్లాట్ సంపాదించింది.

ఇప్పుడు మహారాష్ట్రలోని డైరెక్టరేట్ స్పోర్ట్స్ అండ్ యూత్ అఫైర్స్ పూణేలో తన ఈత కోచ్ తపన్ పాణిగ్రాహి పర్యవేక్షణలో బాలేవాడి స్టేడియంలో సుయాష్ జాదవ్ శిక్షణ పొందుతున్నారు. అతనికి విదేశీ ఎక్స్‌పోజర్ పరంగా భారత ప్రభుత్వం నుండి సహాయం అందించబడింది. ఇందులో అతను ఐదు కంటే ఎక్కువ అంతర్జాతీయ పోటీలలో పాల్గొన్నారు. అలాగే స్పోర్ట్స్ కిట్‌తో పాటు స్పోర్ట్స్ సైన్స్ మద్దతుతో జాతీయ కోచింగ్ క్యాంప్‌లలో పాల్గొన్నారు. 11 సంవత్సరాల వయస్సులో విద్యుదాఘాతానికి గురైన తరువాత సుయాష్ చేతులు తొలగించాల్సి వచ్చింది. 2016 పారాలింపిక్స్ అనంతరం 2018 ఇండోనేషియాలో జరిగిన ఏసియాన్ పారా గేమ్స్‌లో సుయాస్ ఒక బంగారు, రెండు కాంస్యపతకాలను సాధించారు.2018లో ఏకలవ్య అవార్డును, 2020లో అర్జున అవార్డును సాధించారు.

సుయాష్ పాల్గొనున్న 200 మీటర్ల ఇండివిజువల్ మెడ్లీ ఎస్ఎం 7 ఈవెంట్ ఆగస్టు 27 న జరగనుండగా, అతను సెప్టెంబర్ 3 న పురుషుల 50 మీటర్ల బటర్‌ఫ్లై ఎస్7 ఈవెంట్‌లలో నిరంజన్ ముకుందన్‌తో కలిసి మళ్లీ పాల్గొంటారు. అతను జర్మనీలోని హైడెల్‌బర్గ్‌లో 50 మీటర్ల ఫ్రీస్టైల్ స్వర్ణాన్ని సాధించారు.

ఈ నెల ప్రారంభంలో 26 ఏళ్ల బ్యాంకర్ నిరంజన్‌కు అంతర్జాతీయ పారాలింపిక్ కమిటీ ఈ గేమ్స్‌లో స్థానాన్ని కేటాయించింది. నిరంజన్ 60 అంతర్జాతీయ పతకాలను సాధించారు మరియు 50 పతకాల మార్కును దాటిన ఏకైక పారా స్విమ్మర్. నిరంజన్ విదేశీ ఎక్స్‌పోజర్ ట్రిప్‌లతో పాటు స్పోర్ట్స్ సైన్స్ మద్దతుతో జాతీయ కోచింగ్ క్యాంపులలో పాల్గొనడం ద్వారా ప్రభుత్వం నుండి సహాయం పొందారు.

స్టైనల్ బిఫిడా మరియు క్లబ్ట్ పాదాలతో జన్మించిన నిరంజన్ తన అమ్మమ్మను కోల్పోయిన కొన్ని నెలలకే కోవిడ్ -19 బారినపడ్డారు. ఈ క్రమంలో జాన్ క్రిస్టోఫర్ ఆధ్వర్యంలో బెంగళూరులో శిక్షణ పొంది పారాలింపిక్స్‌లో తనదైన ముద్ర వేయడానికి ఆసక్తిగా ఉన్నాడు.

26 ఏళ్ల ప్రాచీ యాదవ్ పారాలింపిక్ గేమ్స్ పారా కానోయింగ్ పోటీలో ప్రవేశించిన మొదటి భారతీయురాలు. ఆమె సెప్టెంబర్ 2 న మహిళల వీఎల్ 2 200 మీటర్ల హీట్స్‌లో పాల్గొంటారు. మరుసటి రోజు సెమీస్ మరియు ఫైనల్ షెడ్యూల్ చేయబడుతుంది. మే 2019 లో పోలాండ్, పోజ్నాన్‌లో జరిగిన ఐసిఎఫ్ పారా కానో వరల్డ్ కప్‌లో ఆమె అంతర్జాతీయ అరంగేట్రంలో మొదటి రౌండ్ మరియు సెమీ ఫైనల్ దాటిన తర్వాత ఆమె ఎనిమిదవ స్థానంలో నిలిచారు. తరువాత 2019 ఆగస్టులో హంగేరీలోని స్జెగ్డ్‌లో జరిగిన ఐసిఎఫ్ పారా కానో వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో ఆమె సెమీఫైనల్లోకి ప్రవేశించారు.

నడుము క్రింద శారీరకలోపం కలిగిన ప్రాచి భోపాల్‌లోని లోవ్ సరస్సులో మయాంక్ సింగ్ ఠాకూర్ ఆధ్వర్యంలో ప్రాచి శిక్షణ పొందారు. అంతర్జాతీయ పోటీలు మరియు జాతీయ కోచింగ్ క్యాంపులతో పాటు క్రీడా సైన్స్ సపోర్ట్ మరియు కిట్‌లతో పాటు భారత ప్రభుత్వం నుండి కీలక మద్దతును ఆమె పొందారు.

దేశంలో అభివృద్ధి చెందిన, విద్యావంతులైన, సాధికారత కలిగిన పంచాయతీల తయారీకి ప్రతిజ్ఞ తీసుకోవాలని కోరిన - గిరిరాజ్ సింగ్

న్యూఢిల్లీ, ఆగష్టు 24:యు.ఎన్.డి.పి. నిర్దేశించిన స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను సాధించడం కోసం, దేశంలో అభివృద్ధి చెందిన, విద్యావంతులైన, సాధికారత కలిగిన పంచాయతీల తయారీకి ప్రతిజ్ఞ తీసుకోవాలని, పంచాయతీరాజ్ శాఖ మంత్రి శ్రీ గిరిరాజ్ సింగ్ పంచాయతీల ప్రతినిధులను కోరారు. 'ఆకలిని తీర్చడంలో పంచాయతీల పాత్ర' అనే అంశంపై నిర్వహించిన జాతీయ వెబినార్ లో కేంద్ర మంత్రి ప్రసంగించారు. "ఆజాదీ-కా-అమృత్ మహోత్సవ్" వేడుకల్లో భాగంగా పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ఈ వెబినార్ ను నిర్వహించింది.

పంచాయితీలు ముందుగా ఆకలి సవాళ్లను స్వీకరించాల్సిన అవసరం ఉందనీ, ఆ పైన "ఆకలిని తీర్చే - జీరో హంగర్" లక్ష్యాన్ని సాధించడానికి తమ శాయశక్తులా కృషి చేయాలనీ, శ్రీ గిరిరాజ్ సింగ్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, పంచాయతీల సాధికారత కోసం నిధుల కేటాయింపులు గణనీయంగా పెరిగాయని ఆయన చెప్పారు. ఈ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి పంచాయితీ రాజ్ మంత్రిత్వ శాఖ ద్వారా వివిధ రకాల శిక్షణా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్లు, ఆయన తెలియజేశారు.

''పంచాయితీ రాజ్ వ్యవస్థలో పారదర్శకతను తీసుకురావడం, వాటిని స్వావలంబన దిశగా మార్చడం ఇప్పుడు మన విధి." అని ఆయన పేర్కొన్నారు.

స్వయం సహాయక బృందాల పాత్రను, శ్రీ సింగ్ ప్రశంసిస్తూ, వివిధ ప్రభుత్వ పథకాల అమలు ప్రణాళికలో స్వయం సహాయక బృందాలకు చెందిన మహిళలను భాగస్వామ్యం చేయాలని పంచాయితీలను కోరారు. మహిళలు దేశ ఆర్థిక శక్తిగా మారుతున్నారని, వారు పంచాయతీలకు కూడా బలం చేకూరుస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాలకు వలసలను నిలిపివేయాలని మంత్రి నొక్కిచెప్పారు. ఇందు కోసం, భారత ప్రభుత్వం అమలు చేస్తున్న రూర్బన్ మిషన్ ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పంచాయితీలను కోరారు.

పంచాయితీలు గ్రామ రూపురేఖలను మార్చగలవని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ సహాయ మంత్రి శ్రీ కపిల్ మోరేశ్వర్ పాటిల్ పేర్కొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులను చేపట్టడానికి వీలుగా, యువతను ప్రోత్సహించాలని ఆయన నొక్కి చెప్పారు. ఇది పేదరికాన్ని నిర్మూలించడంలో గొప్పగా సహాయపడుతుంది.

ఇతర మంత్రిత్వ శాఖలు కూడా, తమ వివిధ పథకాలను విజయవంతంగా అమలు చేయడానికి పంచాయతీలతో సహకరించాలని ఆయన కోరారు.

గ్రామీణ మహిళలకు సాధికారత కల్పించడంతో పాటు, వారికి ఆర్థికంగా స్వావలంబన కల్పించడంలో స్వయం సహాయక బృందాల పాత్రపై కేంద్ర రాష్ట్ర మంత్రి శ్రీ ఫగ్గన్‌సింగ్ కులస్తే నొక్కిచెప్పారు.

సదస్సు ప్రారంభంలో, కేంద్ర పంచాయితీ రాజ్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ సునీల్ కుమార్ ప్రసంగిస్తూ, పంచాయితీలను తమ భూభాగంలో ఎవరూ ఆకలితో నిద్రపోకుండా చూసుకోవాలని కోరారు. స్థానికంగా, ప్రజా పంపిణీ వ్యవస్థ సరైన రీతిలో పనిచేసేలా చూడడం కూడా పంచాయతీల పాత్ర అని ఆయన పేర్కొన్నారు. ఒక రోజంతా జరిగిన ఈ వెబినార్‌లో, వివిధ మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాల సీనియర్ అధికారులు, ప్రపంచ ఆహార కార్యక్రమం, యు.ఎన్.డి.పి. ప్రతినిధులు పాల్గొని, తగినంతగా ఆహార ఉత్పత్తి, ఆహార భద్రత, స్థిరమైన వ్యవసాయ ఉత్పత్తి, ప్రజా పంపిణీ, ఆహార ఉత్పత్తి మరియు ప్రాసెసింగ్ నష్టాన్ని తగ్గించడం, పోషక భద్రత, 2030 నాటికి ఆకలిని తీర్చడాన్ని (జీరో హంగర్) సాధించడంపై ఆధారపడిన సాంకేతిక పరిష్కారాల పరపతి వంటి క్లిష్టమైన సమస్యలు / విషయాలపై వారి అభిప్రాయాలను సమర్పించారు.

జగన్‌ను ఫాలో అవుతున్న షర్మిల

అమరావతి, ఆగష్టు 24:ఏపీ సీఎం జగన్‌ను వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఫాలో అవుతోంది. అన్నతో విభేదాల కారణంగా తెలంగాణలో సొంత కుంపటి పెట్టుకున్న షర్మిల.. అన్న బాటలో నడుస్తోంది. తాజా పరిణామాలు చూస్తే ఈ విషయం సత్యమని ఎవరికైనా అర్థం అవుతుంది. ఏపీలో గతంలో ప్రధాన ప్రతిపక్షంగా వైసీపీ పనిచేసింది. ఆ సమయంలో ఏపీలో పలు సమస్యలపై జగన్ దీక్షలు చేసేవారు. జలదీక్ష, ఉద్యోగ దీక్ష, పోలవరం దీక్ష.. ఇలా చెప్పుకుంటూ పోతే జగన్ లెక్కలేనన్ని దీక్షలు చేశారు. ఆ దీక్షల వల్లే వైసీపీకి ప్రజల్లో బాగా మైలేజ్ వచ్చిందని ఇప్పటికి వైసీపీ అభిమానులు భావిస్తుంటారు.

కట్ చేస్తే ఇప్పుడు తెలంగాణలో ఇటీవల సొంత పార్టీ పెట్టిన షర్మిల తనకు మైలేజీ రావడం కోసం అన్న బాటలో నడుస్తున్నారు. గతంలో ఏ దీక్షలు అయితే తన అన్నకు ప్లస్ పాయింట్ అయ్యాయో.. ఇప్పుడు తాను కూడా అలాంటి దీక్షలు చేస్తే ప్రజలకు దగ్గర కావొచ్చు అన్న భావనతో ఆమె దీక్షలను నమ్ముకుంటున్నారు. అందుకే తెలంగాణలో ప్రతి మంగళవారం ఆమె నిరుద్యోగుల కోసం ప్రతి జిల్లాలో దీక్షలకు దిగుతున్నారు. అయితే అన్న జగన్‌కు వచ్చిన ఫాలోయింగ్ చెల్లెలు షర్మిలకు మిస్ అయ్యింది.